RNI NO:TELTEL/ 2023/89546



# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 406 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 30 ఏప్రిల్ 2025 | వెల : 4/-



# రజతోత్సవ సభతో నయా జోష్!

- కేసీఆర్ ప్లాన్ ఫలించినట్లేనా?
- వరంగల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ సభను విజయవంతంగా నిర్వహించి ప్రజల దృష్టిని ఆకర్షించింది.
- ఈ సభ పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు, నేతల ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఉపయోగపడుతుందని విశ్లేషకుల అంచనా.
- బీఆర్ఎస్‌కు అధికారం వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం ఏర్పడేందుకు కూడా వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉపయోగపడుతుంది.

హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) తెలంగాణలో తన పూర్వ వైభవాన్ని సంపాదించుకునే దిశగా అడుగులు వేయడం మొదలుపెట్టింది. వరంగల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ సభను విజయవంతంగా నిర్వహించి ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఈ సభ పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు, నేతల ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఉపయోగపడుతుందని విశ్లేషకుల అంచనా. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పాలనపై ఇప్పటికే అసంతృప్తి ఏర్పడ్డ నేపథ్యంలో ప్రజల దృష్టి బీజేపీవైపు కాకుండా బీఆర్ఎస్‌కు అధికారం వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం ఏర్పడేందుకు కూడా వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉపయోగపడుతుంది. 2023లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం అనూహ్యమే. దీంతో పార్టీ శ్రేణుల్లోనూ నైరాశ్యం నెలకొంది. ఆ తరువాత జరిగిన పార్లమెంటు, శాసన మండలి ఎన్నికల్లోనూ ఓటమే ఎదురు కావడంతో పరిస్థితులు ఇబ్బందిగా మారాయి. రాజకీయాలలో ఒడిదుడుకులు ఉండటం సహజం. రాజకీయ పార్టీలకు ఇలాంటి పరిస్థితి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎదుర్కొన్నాయి. 1983 నుంచి 1989 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం - మిగతా3లో

# బీఆర్ఎస్ కక్కుర్తి వల్ల చాలా నష్టం జరిగింది

- ఎన్‌డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్
- కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరంతరం బీఆర్ఎస్‌వాళ్లు తప్పుడు ప్రచారాలు చేశారు
- కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాలు పెంచింది
- కమీషన్లకక్కుర్తి కోసం ప్రాణహిత డిజైన్ మార్చింది
- చివరకు తుమ్మిడిహెట్టి వద్ద కట్టాల్సిన బ్యారేజి... మేడిగడ్డ వద్ద వంద మీటర్ల హైట్ తో కట్టారు



హైదరాబాద్

మేడిగడ్డ ప్రాజెక్టు కట్టింది.. కూలిపోయింది.. ఈ విషయాన్ని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికగా ఇచ్చిందని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికపై తెలంగాణ సచివాలయంలో మంగళవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారాయన. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించింది బాధ్యత గల పౌరుడిగా మాట్లాడు తున్నా. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరంతరం బీఆర్ఎస్ వాళ్లు తప్పుడు ప్రచారాలు చేశారు. 16 లక్షల ఎకరాల ఆయకట్టు కోసం.. 38వేల కోట్లతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం అనాడు వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. కానీ - మిగతా3లో



# పాక్‌ను దెబ్బకు దెబ్బ తీయాలి

- ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం
- ఒకవేళ పాక్ కవ్వింపులకు పాల్పడితే రక్షణ పరంగా ఎలా తిప్పికొట్టాలి
- ఓ వైపు రక్షణ పరంగా దెబ్బకొడుతూనే.. దౌత్య పరంగా ప్రపంచ దేశాల ఎదుట పాకిస్తాన్‌ను ఇరుకున పెట్టేలా ఎలా దెబ్బకు దెబ్బ తీయాలి

# కేసీఆర్ పగటి కలలు కంటున్నారు..

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విసుర్లు
- భూ భారతి చట్టం పేదలకు చుట్టం
- భూ భారతి చట్టాన్ని 9 నెలలు మేథోమథనం చేసి రూపొందించాం
- ధరణి చట్టంలో నాడు ఎలాంటి రూల్స్ లేవు
- భూ భారతి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తుంది



కామారెడ్డి

కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మాజీ సీఎం కేసీఆర్ తట్టుకోలేక పోతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. మళ్లీ అధికారం కోసం కేసీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. మంగళవారం లింగంపేట్ మండలం షెట్‌పల్లిలో భూ భారతిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. భూ భారతి చట్టం పేదలకు చుట్టమని - మిగతా3లో



# పహల్గాం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం

- కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగం కల్పిస్తాం
- ఉగదాడి మృతుడు సంతోష్ జగదలే కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయించింది.
- జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

# లబ్ధిదారుల్లో.. అయోమయం

- తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.
- ఈ ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు.
- ప్రభుత్వం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే ఇళ్లను నిర్మించాలని షరతు
- రాష్ట్రంలో మొదటి విడతగా 70,122 ఇళ్లకు అనుమతులు ఇవ్వగా.. 2,830 మంది లబ్ధిదారులు ఇప్పటికే పునాది పనులు పూర్తి

హైదరాబాద్

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే ఇళ్లను నిర్మించాలని షరతు విధించడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో మొదటి విడతగా 70,122 ఇళ్లకు అనుమతులు ఇవ్వగా.. 2,830 మంది లబ్ధిదారులు ఇప్పటికే పునాది పనులు పూర్తి చేశారు. అయితే వీరిలో దాదాపు 280 మంది 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారని అధికారులు గుర్తించారు. దీంతో వారికి మొదటి విడత బిల్లు రూ.లక్షను విడుదల చేయడానికి అధికారులు నిరాకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునాదిలో - మిగతా3లో






# ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీకి చెక్

- చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- స్కూళ్లలో ఫీజులు ఎంత మేరకు ఉండాలనే అంశంపై ప్రభుత్వం విధివిధానాలు ఖరారు
- ఢిల్లీ ప్రభుత్వం చారిత్రాత్మక,సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది
- ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు- 2025 ముసాయిదా బిల్లును ఈరోజు కేబినెట్ ఆమోదించిందని మీకు చెప్పడానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను : ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

# ఎంట్రీ, ఎగ్జిట్ రూట్స్‌ను బ్లాక్ చేసి..

# ఎన్ఐఏ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు



పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తును ముమ్మరం చేసింది. లోకల్ ఫొటోగ్రాఫర్లు, దుకాణదారులు, డ్రైవర్లను ఇలా దాదాపు 45 మంది ప్రత్యక్ష సాక్షులను పిలిచి విచారించింది. ఈ సందర్భంగా వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. బైసరాన్ లోయలో సందర్శకులు తప్పించుకునేందుకు వీల్లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ఉగ్రవాదులు బ్లాక్ చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తమ వాంగ్మూలంలో తెలిపారు. ఇద్దరు ఉగ్రవాదులు ఎంట్రీ గేటు నుంచి లోపలికి ప్రవేశించినట్లు చెప్పారు. మరో ఉగ్రవాది ఎగ్జిట్ గేటు వద్ద ఎవరినీ బయటకు వెళ్లనీకుండా కాపలా కాసినట్లు తెలిపారు. తొలిసారి కాల్పులు మొదలైంది ఎగ్జిట్ గేటు వద్దే అని వివరించారు. దీంతో సందర్శకులు భయంతో ఎంట్రీ గేటువైపు పరుగులు తీయగా.. అక్కడ ఉన్న ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పేర్కొన్నారు. ముందుగా ప్రవేశ ద్వారం వద్దకు వెళ్లిన టూరిస్ట్‌లను మహిళలు, పురుషులు రెండుగా విడిపోవాలని ఉగ్రవాదులు ఆదేశించారు. అయితే, అందుకు వారు నిరాకరించడంతో.. హిందూ, ముస్లింలు వేరు కావాలని చెప్పారు. అందుకు కూడా సందర్శకులు నిరాకరించారు. దీంతో వారు వరుసగా దాడులకు పాల్పడ్డారు. ఇక కాల్పులు జరిపే ముందు పర్యాటకులను కల్మా పఠించాలని కోరారు. కల్మా పఠించిన వారిని ఉగ్రవాదులు వదిలిపెట్టారు. ఇక ప్రవేశ ద్వారం నుంచి వచ్చిన నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్.. ఉగ్రవాదుల కాల్పులకు గురైన మొదటి వ్యక్తి. టూరిస్ట్ స్పాట్‌లోని టీ స్టాల్, ఫుడ్ స్టాల్ ప్రాంత సమీపంలోనే అత్యధికంగా ప్రాణ నష్టం జరిగింది. దాడి అనంతరం ముగ్గురు ఉగ్రవాదులు సమీపంలోని అడవిలోకి పారిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తమ వాంగ్మూలంలో తెలిపారు. ఇక మరో ఉగ్రవాది దాడిలోపాల్గొన్న వారికి రక్షణ కల్పించేందుకు సమీపంలోని అడవిలో దాక్కొని ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరు ముష్కరులు సైనిక దుస్తులు ధరించగా.. ఒకరు సంప్రదాయ కశ్మీరీ డ్రెస్‌లో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తమ వాంగ్మూలంలో వెల్లడించారు.

# కశ్మీర్‌లో స్లీపర్‌సెల్స్ యాక్టివ్.. ఇంటెలిజెన్స్ హెచ్చరిక





శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం దాడి ఘటనతో అక్కడ భారత ఆర్మీ హైఅలర్ట్‌లో ఉంది. మరోవైపు.. కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో 48 టూరిస్టు కేంద్రాలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. వివరాల ప్రకారం.. పహల్గాం దాడి అనంతరం కశ్మీర? లోయలో స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయినట్లు నిఘావర్గాలు తెలిపాయి. దీంతో, కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. అనంతరం, కశ్మీర్‌లో ఉన్న 48 టూరిస్టు కేంద్రాలను ప్రభుత్వం మూసివేసింది. కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో వీటిని మూసివేస్తున్నట్లు పేర్కొన్న అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులను పాశవికంగా హతమార్చిన ఘటనపై చర్చించేందుకు జమ్ముకశ్మీర్ శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఉగ్రదాడి మృతులకు సంతాపసూచకంగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించింది. పాశవికదాడిపై తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేస్తూ ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది.

**కశ్మీర్లో 48 టూరిస్ట్ 4 ప్రాంతాల మూసివేత**

దానికి ముందు సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 'బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. పహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకొని రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో రాష్ట్ర హోదా అడిగాం.. భవిష్యత్తులో కూడా అడుగుతాం. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు. ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. ఉగ్రవాదం అంతమవుతుంది' అని పేర్కొన్నారు.

# సింధూ జలాల ఒప్పందం రద్దుతో..

# చీనాబ్ నదిలో పాకిస్థాన్‌కు తగ్గిన నీటి ప్రవాహం




న్యూఢిల్లీ: పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సిందూ జలాల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీని ఫలితంగా చీనాబ్ నదిలో నీటి ప్రవాహం తగ్గినట్లు గుర్తిస్తున్నారు. శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ఇండియా నుంచి పాకిస్థాన్‌లోకి చీనాబ్ నది ప్రవహిస్తుంది. పాకిస్తాన్‌లోని సియాల్‌కోట్ వద్ద ఉన్న మరలా హెడ్‌వర్క్స్ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని శాటిలైట్ చిత్రాల ద్వారా పసికట్టారు. ఒప్పందాన్ని సస్పెండ్ చేయడానికి ముందు ఏప్రిల్ 21వ తేదీన ఉన్న నీటి స్థాయిని, ఆ తర్వాత ఏప్రిల్ 26వ తేదీన బ్యారేజీ వద్ద ఉన్న నీటి స్థాయిని శాటిలైట్ చిత్రాల ద్వారా రిలీజ్ చేశారు. ఏప్రిల్ 26 తర్వాత బ్యారేజ్ వద్ద ఎక్కువగా బురుద, రాళ్లు పేరుకుపోయినట్లు గుర్తించారు. మరలా హెడ్‌వర్క్స్ వద్ద కొన్ని ప్రాంతాల్లో నీటి స్థాయి పూర్తిగా పడిపోయిందని, శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం స్పష్టం అవుతున్నట్లు కల్నల్ వినాయక్ భట్ తెలిపారు. శాటిలైట్ చిత్రాలను విశ్లేషించే ఆయన వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన తర్వాత ఇండియాలో చీనాబ్ నది నీటి స్టోరేజీ పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. చంద్ర, భాగా నదులు కలిసిన తర్వాత చీనాబ్ నదిగా మారుతుంది. మనాలీ, లేహ్ రూట్లో ఉన్న బరాలాచా లా పాస్ వద్ద ఆ నదులు కలుస్తాయి. చంబా మీదుగా నార్త్ వెస్ట్ రూట్లో చీనాబ్ నీరు జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశిస్తుంది. కిస్టావర్, దోడా, రాంబన్, రియాసీ, జమ్మూ జిల్లాల మీదుగా ఆ నది ప్రవహిస్తుంది. ఆ తర్వాత పాకిస్థాన్‌లోని బవల్‌పూర్‌లో సట్లజ్ నదిలో కలుస్తుంది. ఈ నదిపై హైడ్రో పవర్‌ను అధిక స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. భారత్ వైపునే సుమారు ఏడు వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. పాకిస్థాన్ వైపు చీనాబ్ నదిపై ఉన్న మరలా హెడ్‌వర్క్స్ బ్యారేజీ.. ఆక్నూర్ సెక్టార్‌లోని అంతర్జాతీయ బోర్డర్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీనిపై ప్రధానంగా రెండు ఇరిగేషన్ లింకు కెనాల్స్ ఉన్నాయి. మరలా-రావి లింక్ కింద సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. ఇక బంబన్‌వాలా-రావి-బెడియాన్-దీపాల్‌పుర్ కెనాల్ కింద సుమారు 4200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. ఈ కెనాల్‌నే ఇచోగిల్ కెనాల్ అని కూడా పిలుస్తారు. హెడ్‌వర్క్స్, ఎంఆర్ఎల్ బ్యారేజీలను బ్రిటీష్ కాలంలో నిర్మించారు. 1906 నుంచి 1912 మధ్యలో వీటిని కట్టారు. పాకిస్థాన్‌లో ఉన్న గుర్జన్‌వాలా ప్రాంతానికి నీరు వెళ్తుంది. ఇక్కడ ప్రవహించే నీటికి మిలిటరీ ప్రాముఖ్యత కూడా ఉంటుంది. పాకిస్థాన్‌లో ఉన్న ఎక్కువ ఆర్మీ యూనిట్లు అన్నీ ఇక్కడ కెనాల్స్‌పై ఆధారపడుతుంటాయని రక్షణశాఖ నిపుణులు వెల్లడిస్తున్నారు. నీటి ప్రవాహం తగ్గడం వల్ల అది సైనిక సత్తాపై నేరుగా ప్రభావం పడే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

## పాక్‌ను దెబ్బకు దెబ్బ తీయాలి



**ఢిల్లీ:** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో కీలక సమావేశం ప్రారంభమైంది. మంగళవారం ప్రధాని మోదీ నివాసంలో ప్రారంభమైన ఈ సమావేశానికి త్రివిధ దళాదిపతులు హజరయ్యారు. వీరితో పాటు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్, సీడీఎస్ అనీల్ చౌహాన్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గత బుధవారం భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి. భద్రతా బలగాల మోహరింపు వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు త్వరలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రలో పాక్ కవ్వింపులు చర్యలకు పాల్పడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఒకవేళ పాక్ కవ్వింపులకు పాల్పడితే రక్షణ పరంగా ఎలా తిప్పికొట్టాలి. ఓ వైపు రక్షణ పరంగా దెబ్బకొడుతూనే.. దౌత్య పరంగా ప్రపంచ దేశాల ఎదుట పాకిస్తాన్‌ను ఇరుకున పెట్టేలా ఎలా దెబ్బకు దెబ్బ తీయాలనే తదితర అంశాలపై ప్రముఖంగా చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## పహల్గాం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం



**ముంబై:** పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మహారాష్ట్రకు చెందిన 6 కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మంగళవారంనాడు ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సాయం ఇస్తామని, వారి పిల్లల చదువులు, కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. దేవేంద్ర ఫడ్నవిస్ అధ్యక్షతన మంగళవారంనాడిక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో పహల్గాం మృతుల కుటుంబాలకు తొలుత సంతాపం ప్రకటించారు. అనంతరం మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉగదాడి మృతుడు సంతోష్ జగదలే కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయించింది.

జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

దీనికి ముందు, జమ్మూకశ్మీర్ ప్రభుత్వం పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది.

## ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీకి చెక్

**ఢిల్లీ :** ప్రైవేట్ స్కూళ్లల్లో అడ్డగోలు ఫీజుల దందాపై చరిత్రలో తొలిసారి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఢిల్లీ స్కూళ్లలో ఫీజులు ఎంత మేరకు ఉండాలనే అంశంపై ప్రభుత్వం విధివిధానాల్ని ఖరారు చేసింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోనుంది. ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు- 2025పై ఢిల్లీ కేబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో పలు స్కూల్స్ ఏకపక్షంగా ఫీజుల పెంచుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఢిల్లీ కేబినెట్ మంగళవారం పాఠశాల ఫీజులను నియంత్రించడానికి చట్టాన్ని ఆమోదించింది. అనంతరం ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మీడియాతో మాట్లాడారు. నా ఆనందానికి అవధుల్లేవు.ఢిల్లీ ప్రభుత్వం ధైర్యమైన నిర్ణయం నిర్ణయం తీసుకుంది. పలు స్కూల్స్ ఏకపక్షంగా ఫీజుల పెంచుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఢిల్లీ కేబినెట్ మంగళవారం పాఠశాల ఫీజులను నియంత్రించడానికి ఒక చట్టాన్ని ఆమోదించింది. ఢిల్లీ ప్రభుత్వం చారిత్రాత్మక,సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు- 2025 ముసాయిదా బిల్లును ఈరోజు కేబినెట్ ఆమోదించిందని మీకు చెప్పడానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను'అని అన్నారు. ఢిల్లీలోని 1,677 పాఠశాలలు ఎయిడెడ్, నాన్-ఎయిడెడ్ లేదా ప్రైవేట్ అయినా, ఫీజులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకం, విధానాన్ని నిర్ణయిస్తారు. చరిత్రలో మొదటిసారిగా, అటువంటి బిల్లును ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. విద్యా మంత్రి ఆశిష్ సూద్ మాట్లాడుతూ, కొత్త నిబంధనలను అమలు చేయడానికి మూడు కమిటీలను ఏర్పాటు చేస్తామని, పాఠశాల మౌలిక సదుపాయాల ఆధారంగా మూడు సంవత్సరాల పాటు ఫీజులను ప్యానెల్లు నిర్ణయిస్తాయని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా నిర్ణయం తీసుకునే ప్రక్రియలో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల ప్రారంభంలో ఢిల్లీలోని పలు స్కూళ్లు ఏకపక్షంగా ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ తల్లి దండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి.ఫిర్యాదులతో పలు పాఠశాలలకు ఢిల్లీ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. తన ప్రభుత్వం పారదర్శకత, పిల్లల విద్యా హక్కు రక్షణకు కట్టుబడి ఉందని ఆ సమయంలో సీఎం రేఖా గుప్తా స్పష్టం చేశారు.

## ఐక్యత చాటాల్సిన తరుణమిది.. మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ:** పహల్గాం దాడి నేపథ్యంతో ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. ఇటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వేర్వేరు ఈ ఇద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాశారు. 2025 ఏప్రిల్ 22న పహల్గాం ఘటనలో అమాయక పౌరులపై జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడి జరిగింది. ఈ తరుణంలో ఐక్యత, సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉంది. అందుకే పార్లమెంట్ ఉభయ సభలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించండి. తద్వారా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలనే మన సమిష్టి సంకల్పానికి ఇది శక్తివంతమైన ప్రదర్శన అవుతుంది అని ఖర్గే తన లేఖలో ప్రస్తావించారు. ఇక తన లేఖలో రాహుల్ గాంధీ.. ప్రియమైన ప్రధానిగారూ.. పహల్గాం ఉగ్రదాడితో ప్రతీ భారతీయుడు రగిలిపోతున్నాడు. ఇలాంటి క్లిష్టతరుణంలో ఉగ్రవాదానికి మనమెంత వ్యతిరేకమో చాటిచెప్పాల్సిన అవసరం ఉంది. ఐక్యత ప్రదర్శించాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయి. అది పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల మాత్రమే సాధ్యపడుతుందని ప్రతిపక్షంగా మేం భావిస్తున్నాం. ఇక్కడే ప్రజాప్రతినిధులు తమ ఐక్యతను, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించగలరు.

# రజతోత్సవ సభతో నయా జోష్!

-మొదటిపేజీ తరువాయి

పార్టీ 1989 లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాలకే పరిమితమైంది. ఆ తర్వాత 1991లో 13 సీట్లు వచ్చాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లపాటు సీఎంగా ఉన్నారు. కానీ ఆయన ఒంటెద్దు పోకడల ఆరోపణలు, వ్యతిరేకత ఉందని తెలిసి సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వడం వంటి అనేకానేక కారణాల వల్ల 2023 ఎన్నికల్లో పార్టీ 39 సీట్లకే పరిమితమైంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదానైతే దక్కిం?చుకుంది కానీ.. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో కొంత నష్టం చేసింది. రేవంత్ రెడ్డి సర్కార్ కాళేశ్వరం, తదితర అంశాలపై విచారణ కమిషన్లు వేయడం కూడా పార్టీపై వ్యతిరేక ప్రచారం జరిగేందుకు అవకాశమిచ్చింది. దీన్ని అధిగమించడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజలలో వ్యతిరేకత పెంచడానికి కేసీఆర్ ఈ రజతోత్సవ సభను వాడుకున్నారు. తన పాలనకు, కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడాను వివరించి, ప్రస్తుతం తెలంగాణ ఆగమవుతోందని, అది చూసి తనకు దుఃఖం వేస్తోందని ఆయన చెప్పారు. అలాగే తెలంగాణ ఉద్యమం నాటి సంగతులు, 1956 నుంచి జరిగిన రాజకీయ పరిణామాలు అన్నింటినీ ప్రజలకు వివరించడం ద్వారా మరోసారి సెంటిమెంట్‌ను ప్రయోగించే యత్నం చేసినట్లు స్పష్టంగా బోధపడుతుంది. ఈ క్రమంలో 1956లో ప్రజలంతా తెలంగాణ, ఏపీలో కలపడానికి వ్యతిరేకించారని ఆయన చెప్పడం కొంత వక్రీకరించడమే అవుతుంది. ఎందుకంటే అప్పట్లో తెలంగాణ, ఆంధ్రలు కలవడానికి అంగీకరించని వారు కొంతమంది ఉండవచ్చు కానీ, హైదరాబాద్ శాసనసభలో ఉమ్మడి ఏపీకి అనుకూలంగా మెజార్టీ సభ్యులు మాట్లాడారు. అంతేకాదు.. అంతకుముందు ప్రముఖుల సారథ్యంలో తెలంగాణలో సైతం ఆంధ్ర మహాసభలు జరిగేవి. చరిత్రను ఎవరికి అనుకూలంగా వారు చెప్పుకోవచ్చు. అది వేరే విషయం. 2009లో సోనియాగాంధీ తెలంగాణ ప్రకటన చేయడం కీలకమైన మలుపు. టీఆర్ఎస్‌కు అప్పట్లో ఇద్దరు ఎంపీలే ఉండేవారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడం, తదనంతరం జరిగిన పరిణామాలలో తెలంగాణలోని కాంగ్రెస్ నేతలు పలువురు ప్రత్యేక రాష్ట్ర సాధనకు కట్టుబడి ఉండటం, చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇవ్వడం వంటి అంశాలు కలిసి వచ్చాయి. తెలంగాణ వాదంతో కాంగ్రెస్, టీడీపీలను కేసీఆర్ భయపెట్టగలిగారు. ఆ పార్టీలను తనదారిలోకి తెచ్చుకోగలిగారు. అంతవరకు ఉన్న రాజకీయ ఉద్యమం, ప్రజా ఉద్యమంగా మారే పరిస్థితులు ఏర్పడడం కలిసి వచ్చిన అంశం అని చెప్పాలి. ఏది ఏమైనా తెలంగాణకు సంబంధించినంత వరకు గతంలో నాయకత్వం వహించిన చెన్నారెడ్డి, తదితరులకు భిన్నంగా కేసీఆర్ పనిచేసిన మాట నిజం. టీడీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత తెలంగాణ వాదానికే కట్టుబడి రాజకీయం చేశారు. నిజానికి ఇదంతా గతం. ఇప్పుడు ఆ అంశాలను ప్రస్తావించి కాంగ్రెస్ ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు విలనే అని చెప్పడంలో హేతుబద్ధత ఎంత ఉందన్నది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా అని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి, పొన్నం, సీతక్కలు ప్రశ్నించారు. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్నందున కాంగ్రెస్‌నే టార్గెట్ చేస్తారు. అదే పని కేసీఆర్ చేశారు. బీజేపీపై మాత్రం నామమాత్రపు విమర్శలు చేశారనే చెప్పాలి. అంత భారీ సభలో కేసీఆర్ ఒక్కరే మాట్లాడటం కూడా విశేషమే. సాధారణంగా ఇలాంటి సభలలో నాయకుడు వచ్చేలోగా పలువురు నేతలు మాట్లాడుతుంటారు. ఈసారి అలా చేయలేదు. కాకపోతే పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు అయిన కేటీఆర్ ప్రాముఖ్యతను మరింత పెరిగేలా ఈ సభలలో జాగ్రత్తపడ్డారని అనుకోవాలి. సభా వేదికపై కూడా కేసీఆర్‌తోపాటు ఆయన ఫోటో కూడా ఉంచారు. కేసీఆర్ తన స్పీచ్‌ను మరీ ఎక్కువ సేపు చేయలేదు. అంతేగాక.. పరుష పదాలతో కాంగ్రెస్‌ను తీవ్రంగా రెచ్చగొట్టే యత్నం కూడా చేసినట్లు అనిపించదు. కాంగ్రెస్ పాలనపై గట్టి విమర్శలే చేస్తూ, ప్రధానంగా తెలంగాణ ఆగమైందని, రియల్ ఎస్టేట్ పడిపోయిందని, రైతులు పాట్లు పడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రస్తావించి వాటిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్లు ప్రస్తావించకుండా ప్రసంగించడం కూడా చెప్పుకోదగిన అంశమే. కాంగ్రెస్ పార్టీ హామీలపై బాండ్లు రాసిచ్చి ప్రజలను మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇందులో వాస్తవం ఉందని చెప్పక తప్పదు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన కొన్ని వాగ్దానాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపయోగం లేదని ఆయన తేల్చారు. తన పాలన గురించి చెబుతూ ప్రత్యేకించి రాష్ట్రంలో నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించడంలో నెంబర్ వన్‌గా ఉన్నామని, భూముల విలువలు పెరగడానికి దోహదపడ్డామని, రైతుబంధును అమలు చేయడం ద్వారా రైతులకు మేలు చేశామని ఆయన వివరించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతోందని, పోలీసులకు రాజకీయాలు వద్దని ఆయన సూచించారు. ఆయా సందర్భాలలో సభలోని వారిని కూడా ఇన్వాల్వ్ చేస్తూ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై చేస్తున్న ఆరోపణలు, అధిక అప్పుల భారం, ఫోన్ ట్యాపింగ్ తదితర అంశాల జోలికి వెళ్లలేదు. కేసీఆర్ స్పీచ్ ముగిసిన వెంటనే మంత్రులు గట్టిగానే జవాబు ఇచ్చారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, ఆయన చేసిన విమర్శలపై చర్చకు సిద్ధమని అన్నారు. పొన్నం ప్రభాకర్ అయితే గ్రీన్‌మ్యాట్ వేసి ప్రజలు అధికంగా వచ్చినట్లు చూపే యత్నం జరిగిందని ఆరోపించారు. కాకపోతే గతంలో మాదిరి కాకుండా, ఇప్పుడు కనుచూపు మేర కుర్చీలు వేశారు. రాజకీయ సభల నిర్వహణలో చాలా మార్పులు వస్తున్నాయి. ఏ పార్టీ సభ జరిగినా, గతంలో ఒకటి, రెండు బ్లాక్‌లు తప్ప, అంతా కిందే కూర్చునేవారు. ఇప్పుడు అలా చేయడం లేదు. విశేషం ఏమిటంటే కేసీఆర్‌పై విమర్శలు చేసిన మంత్రులలో పొంగులేటి, జూపల్లి గతంలో బీఆర్ఎస్ ప్రముఖులు. గత ఎన్నికల సమయంలో వారు కాంగ్రెస్ పక్షాన పోటీచేసి గెలిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకంటే చిన్నవాడు కావడం, కొందరు మంత్రులు గతంలో తన వద్ద పని చేసినవారు కావడం తదితర కారణాల వల్ల బహుశా ఆయన ఈగో సమస్య ఎదుర్కొంటున్నారని అది కేసీఆర్ స్పీచ్‌లో కనిపించిందని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ఓవరాల్‌గా పరిశీలిస్తే రజతోత్సవ సభకు జనం బాగానే వచ్చారు. స్పందన కూడా బాగానే ఉంది. కానీ, ఇదే వరంగల్‌లో ఉద్యమ సమయంలో ఇంతకన్నా భారీ బహిరంగ సభలే జరిగాయి. అయినా భారీ సభలే అన్నిటికి కొలమానం కావు. కాకపోతే జనంలో పార్టీ పట్ల ఒక నమ్మకాన్ని పెంచడానికి రజతోత్సవ సభ కొంతమేర అవకాశం కలిగిస్తుంది. కేసీఆర్ ఒక్కరే మాట్లాడడం వల్ల ఎంతవరకు ప్రయోజనమో చెప్పలేం. కేసీఆర్ పూర్వపు స్పీచ్‌ల మాదిరి మరీ ఘాటుగా మాట్లాడలేదన్నది ఎక్కువ మంది అభిప్రాయం. అదేమీ తప్పు కాదు. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్లు ఉన్నప్పటికీ, ఈ సభ ద్వారా తాను మళ్లీ బయటకు వచ్చి జనంలో తిరుగుతానని కేసీఆర్ చెబుతున్నారు. ఇప్పటికీ కేసీఆర్ గ్లామర్ పైనే బీఆర్ఎస్ ఆధారపడి ఉన్న నేపథ్యంలో ఇది కీలకం.

# ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క రియాక్షన్



**వరంగల్, ఏప్రిల్ 29:** మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు. మంగలవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు. తెలంగాణ, చత్తీస్గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు. అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ బృందం కలిసింది. కాగా.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు గత వారం రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. ఆపరేషన్ కర్రెగుట్టలు నిలిపివేయాలని ఓ వైపు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి. అటు మావోయిస్టులు కూడా ఇప్పటికే మూడు నాలుగు సార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అంతేకాకుండా కర్రెగుట్టలపై బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈరోజు ఒక్కరోజే వెంకటాపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి కర్రెగుట్టలపైకి రెండు హెలికాప్టర్లు నాలుగు సార్లు అక్కడకు వెళ్లి బలగాలు, మందుగుండు సామాగ్రిని తరలించాయి. ఇటీవల వడదెబ్బ కారణంగా 40 మంది జవాన్లు వెనక్కి వచ్చినప్పటికీ రెట్టింపు సంఖ్యలో బలగాలను చేరవేస్తూ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# రేవంత్, కేసీఆర్... ఒకటే మాట

## ఆపరేషన్ కగార్‌ను ఆపాలంటూ డిమాండ్





**హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. పదేళ్లుగా వీరిమధ్య రాజకీయ వైరం కొనసాగుతోంది. అయితే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అంటారు. పార్టీ సిద్ధాంతం పరంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ ముఖ్యమైన మంత్రి కేటీఆర్ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తారు. కానీ, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రేవంత్‌రెడ్డికి కేటీఆర్ మద్దతు తెలిపారు. ఇప్పుడు మావోయిస్టుల విషయంలో కేసీఆర్ మద్దతు తెలిపారు. తెలంగాణ రాజకీయాల్లో అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ ప్రత్యర్థులైన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మావోయిస్టు సమస్యపై ఒకే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని తీవ్రతరం చేశాయి. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపు 30 మంది నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. అయితే, ఈ ఆపరేషన్ అమాయక గిరిజనులు, సామాన్య ప్రజలపై ప్రభావం చూపుతోందని రేవంత్, కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని తక్షణం నిలిపివేయాలని ఇద్దరూ డిమాండ్ చేశారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నారని, కేంద్రం కూంబింగ్ ఆపరేషన్లు, కాల్పులను ఆపి చర్చలకు ముందుకు రావాలని కేసీఆర్ వరంగల్‌లోని ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరపున కేంద్రానికి లేఖ రాస్తామని ఆయన ప్రకటించారు. మరోవైపు, శాంతి చర్చల కమిటీ నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, కేంద్రాన్ని కాల్పుల విరమణకు ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను సామాజిక కోణంలో చూస్తామని, శాంతి?భద్రతల సమస్యగా కాదని రేవంత్ స్పష్టం చేశారు. నక్సలిజం సమస్యపై చర్చలకు అనుభవం ఉన్న మంత్రి జానారెడ్డి సలహాలు తీసుకుని, ఇతర మంత్రులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సునిశితంగా వ్యవహరిస్తూ, కేంద్రంతో సమన్వయం చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. కేసీఆర్ కూడా ఈ అంశాన్ని బలంగా లేవనెత్తి, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఒకరి విధానాలను మరొకరు తీవ్రంగా విమర్శించుకునే రేవంత్, కేసీఆర్ మావోయిస్టు సమస్య విషయంలో ఒకే గొంతుతో మాట్లాడటం తెలంగాణ రాజకీయాల్లో అరుదైన సంఘటన. ఈ ఏకాభిప్రాయం రాష్ట్రంలో శాంతి ప్రక్రియను బలోపేతం చేస్తుందా లేదా రాజకీయ లబ్ధికి ఉపయోగపడుతుందా అనేది చర్చనీయాంశం. ఈ అంశంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాలిమావోయిస్టు సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలనే రేవంత్, కేసీఆర్ ఉద్దేశం తెలంగాణలో శాంతి ప్రక్రియకు కొత్త దిశను ఇవ్వవచ్చు. ఈ సమస్యకు హింసాత్మక పరిష్కారం కాకుండా, చర్చల ద్వారా మార్గం సుగమం చేయాలనే ఇద్దరి నేతల ఆలోచన రాష్ట్రంలో సామాజిక సమస్యల పరిష్కారానికి ఒక ముందడుగుగా పరిగణించబడుతోంది. ఈ ఏకాభిప్రాయం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందో రాబోయే రోజులు తేల్చనున్నాయి.

## కేసీఆర్ పగటి కలలు కంటున్నారు..

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. భూ భారతి చట్టాన్ని 9 నెలలు మేథోమథనం చేసి రూపొందించామని అన్నారు. పేదల సంక్షేమమే ఇందిరమ్మ సర్కారు లక్ష్యమని తెలిపారు. ధరణి చట్టంలో నాడు ఎలాంటి రూల్స్ లేవని చెప్పారు. భూ భారతి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. ధరణితో రైతులు కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరిగారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధరణితో ఏర్పడ్డ భూ వివాదాలన్నీ భూ భారతి ద్వారా పరిష్కారం అవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. కింది స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే స్పెషల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. సర్వే అధికారులు లేనందున చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. త్వరలో 6 వేలమంది ప్రైవేటు సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. పాస్‌బుక్‌లో సర్వే మ్యాప్ ఏర్పాటు చేస్తామని అన్నారు. పైలెట్ గ్రామాల్లో జూన్ 2వ తేదీ నాటికి వందశాతం భూ సమస్యలన్నీ తొలగిపోతాయని చెప్పారు. జూన్ 2వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు అన్ని మండలాల్లో భూ వివాదాల పరిష్కారమవుతాయని తెలిపారు. మే 5వ తేదీ లోగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని.. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. రాబోయే ఐదేళ్లు 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. తరతరాల నుంచి సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## బీఆర్ఎస్ కక్కుర్తి వల్ల చాలా నష్టం జరిగింది

-మొదటిపేజీ తరువాయి



బీఆర్ఎస్ ప్రభుత్వం రీ ఇంజినీరింగ్, రీ డిజైనింగ్ చేసింది. కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాలు పెంచింది. కమీషన్లకక్కుర్తి కోసం ప్రాణహిత డిజైన్ మార్చింది. చివరకు తుమ్మిడిహెట్టి వద్ద కట్టాల్సిన బ్యారేజి...మేడిగడ్డ వద్ద వంద మీటర్ల హైట్ తో కట్టారు. దీని వల్ల ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాకు తీవ్ర నష్టం జరిగింది.

తుమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చే బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద తప్పు చేసింది. బ్యారేజీల నిర్మాణ సమయంలోనే లోపాలు తెలిసినప్పటికీ సరిదిద్దుకోలేదు. సుందిళ్ల, అన్నారం దగ్గర సాయిల్ టెస్ట్ చేయలేదు. ప్రారంభానికి ముందే లోపాలు బయటపడ్డాయి.. కానీ, బీఆర్ఎస్ ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర నష్టం జరిగింది. కాళేశ్వరం డిజైన్లు ఒకలా ఉంటే.. మరోలా నిర్మాణం చేశారు. ప్రాజెక్టు కోసం 85 వేల కోట్లు అంచనా వేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం లోన్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కూలింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మేడిగడ్డ పరిశీలనకు వచ్చింది గత ప్రభుత్వం పాలనలోనే. మేడిగడ్డ లో డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ గత ప్రభుత్వ హయంలోనే ఇచ్చారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అథారిటీ బిల్లుకు పార్లమెంట్‌లో బీఆర్ఎస్ మద్దతు పలికింది. దేశంలో 5600 బ్యారేజీలు, డ్యామ్‌లను ఎన్‌డీఎస్ఏ పర్యవేక్షిస్తోంది. దేశంలో ఏ బ్యారేజీకి ఎలాంటి సమస్య వచ్చినా ఎన్‌డీఎస్ఏ నుంచే అభిప్రాయం చెప్తుంది. ఎన్‌డీఎస్ఏలో జాతీయ అంతర్జాతీయ నిపుణులు ఉన్నారు. అలాంటిది ఎన్‌డీఎస్ఏ నిపుణులను సైతం బీఆర్ఎస్‌నాయకులు కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రాష్ట్రంపై లక్షన్నర కోట్ల భారం పడుతోంది. ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులకు మిత్తి ఏడాదికి 16వేలు కట్టాల్సి వస్తోంది. మేం అధికారంలోకి వచ్చాక మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌కు లేఖ చేశాం. 14 నెలలు పరిశీలించి నివేదిక రూపొందించింది. గత ప్రభుత్వ కక్కుర్తి వల్ల చాలా నష్టం జరిగింది తుమ్మెడిహట్టి దగ్గర రెండు ప్రాజెక్టులు కడతామన్నారు. తట్టెడు మట్టి కూడా పోయలేదు. పైగా అక్కడ నీటి లభ్యత లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు.. లొకేషన్ పెద్ద మిస్టేక్. అది కూలినప్పుడు కేసీఆర్ సీఎంగా ఉన్నారు. వాల్స్, భీమ్స్‌లో రంధ్రాలు వచ్చాయని ఎన్‌డీఎస్ఏ పేర్కొంది. ఇంతకన్నా సిగ్గు చేటు ఉంటుందా?. సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి.. అనవసర మాటలు మాట్లాడుతున్నారు అని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. కాళేశ్వరాన్ని ఉపయోగించుకునే స్థితి లేదని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. రీడిజైన్ చేసి నిర్మాణం చేయాలని చెప్పింది. రిపోర్ట్ ఆధారంగానే ముందుకు వెళ్తాం ప్రాజెక్టు తప్పిదాలకు కారణమైన అధికారుల పై చట్టప్రకారం చర్యలు ఉంటాయి. అధికారులు తప్పిదాలు చేయడానికి కారణమైన వ్యక్తి గత ప్రభుత్వ పెద్ద కేసీఆర్ . చట్టప్రకారం గత ప్రభుత్వ పాలకులు, అధికారులపై చర్యలు ఉంటాయి. రాబోయే కేబినెట్ భేటీలో ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ పై చర్చ జరుపుతాం. క్యాబినేట్ లో చర్చించిన తర్వాత ప్రాజెక్టు పై తదుపరి కార్యాచరణ ప్రకటన చేస్తాం.

## లబ్దిదారుల్లో అయోమయం




-మొదటిపేజీ తరువాయి

మార్పులు చేసుకుంటేనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సొంత స్థలాలు ఉన్నవారు తమకు నచ్చిన విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకోవచ్చని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం అనేక సందర్భాల్లో చెప్పిందని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, మోడల్ ఇళ్లను అందుబాటులో ఉంచి ఎలాంటి నిబంధనలు ఉండవని తెలిపిందంటున్నారు.ఇప్పుడు హఠాత్తుగా 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించాలని చెప్పడం సరికాదని అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు అదనంగా తాము కూడా డబ్బులు ఖర్చు చేసుకుంటున్నామని, ఇప్పుడు నిబంధనలు విధిస్తే ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అయితే 600 చదరపు అడుగులు దాటితే బీపీఎల్ పరిధిలోకి రారని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి పేదల ఇళ్లను 400 చదరపు అడుగుల్లోనే నిర్మించాలని.. ప్రభుత్వం అదనంగా 200 చదరపు అడుగులకు పెంచిందని గృహ నిర్మాణ శాఖ పేర్కొంటోంది. ఈ మేరకు ఇండ్ల నిర్మాణాలు చేపడితేనే బిల్లులు వస్తాయని క్లారిటీ ఇచ్చారు.ఇక మే 5వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఉండాలనే నిబంధనను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగాలకు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ ఇంటి నిర్మాణాలను చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

## సంపాదకీయం

# పీఓకే నుంచి పరార్

పహల్గాం ఉగ్రదాడితో భారత్– పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ ధీటైన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో.. దేనికైనా సిద్ధం, యుద్ధానికి రెడీ అంటూ పైకి మేకపోతు గాంభీర్యాలు ప్రదర్శిస్తున్నా.. పాకిస్థాన్ లోలోపల వణికిపోతుంది. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నామని ఆధారాలతో తెలిస్తే.. అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అవుతుందని తెలిసి ముందస్తు చర్యలు ప్రారంభించింది. పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత్ ప్రతీకారం తీర్చుకుంటామనే భయంతో.. పాకిస్తాన్ సైన్యం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) అంతటా అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయడం ప్రారంభించిందని నిఘా వర్గాలు సోమవారం వెల్లడించాయి.. భారత దాడులను నివారించడానికి ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, భూగర్భ బంకర్లలోకి మారుస్తున్నారని నిఘా వర్గాలు తెలిపాయి..పీఓకే ప్రాంతం అంతటా చాలా లాంచ్ ప్యాడ్‌లు ఉన్నట్లు భారత భద్రతా సంస్థలు గుర్తించిన కొంతసేపటికే.. పాకిస్తాన్ ఈ చర్య తీసుకుంది.. కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముకం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుటా, కోట్లి, ఖుయిరట్టా, మంధర్, నికైల్, చమన్‌కోట్, జంకోట్ నుండి ఉగ్రవాదులను తరలించినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి..ఈ లాంచ్ ప్యాడ్‌లు చాలా కాలంగా ఉగ్రవాదులను నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) దాటి జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేశించడానికి..అలాగే.. ఉగ్రవాదులను సమీకరించే కీలక కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. భారత నిఘా, ముందస్తు చర్యల నుంచి తన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కాపాడుకోవడానికి పాకిస్తాన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఎల్‌ఓసి వెంబడి ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి.. ఈ ఉగ్రదాడిలో 26 మంది మరణించారు.గత వారం, భారత భద్రతా దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ అంతటా పనిచేస్తున్న కనీసం 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లు, శిక్షణా కేంద్రాలపై నిఘా పెట్టాయి. నిఘా నివేదికల ప్రకారం, 150 నుండి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ప్రస్తుతం వివిధ శిబిరాల్లో ఉండి, చొరబాటు ప్రయత్నాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత్ వద్ద ప్రస్తుతం రెండు విమాన వాహక నౌకలు ఉన్నాయి. ఒకటి విక్రమాదిత్య, మరొకటి విక్రాంత్. ఈ నౌకలను హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో భద్రతా ప్రయోజనాల కోసం వినియోగిస్తారు" అని యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న తిరునావుక్కరసు చెప్పారు."ఇది చాలా ఉద్రిక్త పరిస్థితి. పహల్గాం దాడి వెనుక నిజంగా పాకిస్తాన్ హస్తం ఉండి, యుద్ధానికి అవకాశం ఉంటే గుజరాత్, ముంబయిలను ఆ దేశం సులభంగా లక్ష్యంగా చేసుకుంటుంది. అందుకే ఆ ప్రదేశాల్లో ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు ఈ నౌకను నిర్మించారు" అని తిరునావుక్కరసు అన్నారు.శ్రీనగర్ లేదా దిల్లీ వైమానిక స్థావరాల నుంచి విమానాలను నడపడం, ఇతర ప్రాంతాల నుంచి దాడులు చేయడం కంటే, ఈ వైమానిక స్థావరం పైనుంచి దాడిని మరింత సులభంగా, వేగంగా చేయవచ్చు. పాకిస్తాన్‌కు అలాంటి విమాన వాహక నౌక లేకపోవడం ఇండియాకు అనుకూలమైన విషయం" అని అన్నారాయన.యుద్ధనౌకకు పూర్తిగా ఇంధనం నింపితే మాటిమాటికి తీరానికి రావాల్సిన పనిలేకుండా సుదీర్ఘకాలం సముద్రంలోనే పనిచేయగలదన్నారు. మధ్య యుద్ధం జరుగుతుందో లేదో ఎవరూ ఊహించలేరు. ఇప్పుడు జరుగుతున్నదంతా భారతదేశపు సంసిద్ధతను తెలియజేయడానికే" అని మాజీ లెఫ్టినెంట్ కల్నల్ త్యాగరాజన్ అన్నారు.భారత సైన్యం తన యుద్ధనౌకలు, విమానాలు, సైనిక దళాలను అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వద్ద ఉన్న స్థావరాలలో మోహరిస్తోంది. శత్రుదళాలు ఏదైనా దాడికి సిద్ధమైతే భారత్ ముందుగానే ఎదుర్కోగలుగుతుంది.ఐఎన్‌ఎస్ విక్రాంత్ ప్రస్తుతం కార్వార్ నుంచి ముందుకు వెళ్తోందంటే అది కూడా ఒక కారణమే. శత్రువుల ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, భూ, సముద్ర, వైమానిక స్థావరాలు, సమాచార కేంద్రాలు, ఆయుధ డిపోలు, చమురు డిపోలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు అవకాశం ఉంటుంది.'1971 యుద్ధం సమయంలో ఐఎన్‌ఎస్ విక్రాంత్ తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)పై సైనిక చర్యలు, నౌకాదళ దాడులు నిర్వహించింది. ప్రస్తుత కార్యకలాపాలు 1971 యుద్ధ వ్యూహాన్నిఅనుసరిస్తూ జరిగి ఉండొచ్చు" అని త్యాగరాజన్ అన్నారు.రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక ఈ నౌక నిర్మాణ పనులు ఆగిపోయాయి. అప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం ఆ అసంపూర్ణ నౌకను అమ్మేస్తామని ప్రకటించింది. 1957లో భారత్ ఈ నౌకను కొనుగోలు చేసింది. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత 1961లో దానిని జాతికి అంకితం చేశారు.సముద్ర మార్గం ద్వారా పాక్ సైనికుల దాడులను అడ్డుకుని, శత్రు లక్ష్యాలను ధ్వంసం చేసిందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పేర్కొంది.భారత నౌకాదళంలో 36 ఏళ్లపాటు సేవలందించిన తరువాత 1997లో విక్రాంత్‌కు విశ్రాంతిని ఇచ్చారు. దీనిని పూర్తిగా ధ్వంసం చేయడానికి ముందు 15 ఏళ్లపాటు మ్యూజియంగానూ ఉపయోగించారు.హిజ్బుల్ ముజాహిదీన్, జైష్-ఎ-మొహమ్మద్ , లష్కరే-ఎ-తోయిబా నుండి దాదాపు 60 మంది విదేశీ ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లో చురుగ్గా ఉన్నారని, 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారని నిఘా వర్గాలు నివేదించాయి..

### ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని

# శాసించిన మహాకవి శ్రీశ్రీ



ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించి, తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పి శ్రీశ్రీగా ఎదిగి, మహాకవిగా గుర్తింపు పొందారు శ్రీరంగం శ్రీనివాసరావు, 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పటకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించాడు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఈయన ఇంటి పేరు శ్రీరంగం గా మారింది. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం విశాఖపట్నం లో జరిగింది. శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవ యేటనే ప్రారంభించాడు. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదవ యేట ప్రచురింపబడింది.1931లో మద్రాసు యూనివర్సిటీలో బి.ఏ పూర్తి చేశాడు.1935లో విశాఖలోని మిసెస్ ఎవిఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరాడు. 1938 లో మద్రాసు ఆంధ్రప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తర్వాత ఢిల్లీ ఆకాశవాణిలోను, నిజాం సంస్థానంలోను, ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుంచి 1940 వరకు తాను రాసిన 'గర్జించు రష్యా', 'జగన్నాథ రథ చక్రాలు' వంటి గొప్ప కవితలను సంకలనం చేసి 'మహా ప్రస్థానం' అనే పుస్తకంగా ప్రచురించాడు శ్రీశ్రీ. తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చిన పుస్తకం గా శ్రీశ్రీ మహాప్రస్థానం మిగిలిపోయింది. ఈయన ప్రముఖ హాస్యనటుడు రాజబాబుకు తోడల్లుడు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా ప్రసిద్ధుడయ్యాడు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది మరియు నాస్తికుడు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందాడు. వివిధ దేశాల్లో ఎన్నోమార్లు పర్యటించాడు. ఎన్నో పురస్కారాలు పొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు వీటిలో కొన్ని. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసాడు. 1970లో అతని షష్టిపూర్తి ఉత్సవం విశాఖపట్నంలో జరిగింది. ఆ సందర్భంగానే అతను అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. కొంతకాలం క్యాన్సరు వ్యాధి బాధకు లోనై 1983 జూన్ 15న శ్రీశ్రీ మరణించాడు. మహాప్రస్థానం ఆయన రచించిన కావ్యాల్లో ప్రసిద్ధమైనది... మరో ప్రపంచం,మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది!పదండి ముందుకు, పదండి త్రోసుకు!పోదాం, పోదాం పైపైకి!కదం త్రొక్కుతూ,పదం పాడుతూ, హృదాంత రాళం గర్జిస్తూ–పదండి పోదాం, వినబడలేదామరో ప్రపంచపు జలపాతం?దారిపొడుగునా గుండె నెత్తురులుతర్పణ చేస్తూ పదండి ముందుకు!బాటలు నడచీ,పేటలు కడచీ, కోటలన్నిటిని దాటండి!నదీ నదాలూ, అడవులు, కొండలు, ఎడారులా మన కడ్డంకి?పదండి ముందుకు! పదండి త్రోసుకు! పోదాం, పోదాం, పైపైకి! ఎముకులు క్రుళ్ళిన, వయస్సు మళ్ళినసోమరులారా! చావండి! నెత్తురు మండే, శక్తులు నిండే,సైనికులారా! రారండి!"హరోం! హరోం హర! హర! హర! హర! హర!హరోం హరా!" అని కదలండి!మరో ప్రపంచం, మహా ప్రపంచంధరిత్రినిండా నిండింది!పదండి ముందుకు,పదండి త్రోసుకు!ప్రభంజనంవలె హోరెత్తండీ!భావ వేగమున ప్రసరించండీ!వర్షుకాభ్రముల ప్రళయ ఘోషవ లెపెళ పెళ పెళ పెళ విరుచుకు పడండి! పదండి, పదండి, పదండి ముందుకు!కనబడలేదా మరో ప్రపంచపు కణకణ మండే త్రేతాగ్ని?ఎగిరి, ఎగిరి, ఎగిరి పడుతున్న విఎనభై లక్షల మేరువులు!తిరిగి, తిరిగి, తిరిగి సముద్రాల్జల ప్రళయ నాట్యం చేస్తున్నవి!సలసలక్రాగే చమురా? కాదిది ఉష్ణరక్త కాసారం! శివసముద్రమూ, నయాగరావలెఉరకండీ! ఉరకండీ ముందుకు!పదండి ముందుకు!పదండి త్రోసుకు! మరో ప్రపంచపు కంచు నగారావిరామ మెరుగక మ్రోగింది! త్రాచులవలెనూ, రేచులవలనూ,ధనంజయునిలా సాగండి! కనబడలేదా మరో ప్రపంచపుఅగ్నికిరీటపు ధగధగలు, ఎర్రబావుటా నిగనిగలు,హోమజ్వాలల భుగభుగలు?

# భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే



దాదాసాహెబ్ పాల్కే అసలు పేరు ధుండీరాజ్ గోవింద్ ఫాల్కే ఈయన ఒక భారతీయ సినీ నిర్మాత, దర్శకుడు, స్క్రీన్‌ప్లే-రచయిత, భారతీయ సినిమా కు ఇతను పితామహుడు. ఇతడి ప్రథమ సినిమా రాజా హరిశ్చంద్ర (భారతీయ మొదటి సినిమా) 1913. ఇతడు తన జీవితంలో 95 ఫీచర్ ఫిల్మ్ లు, నిర్మించాడు. బొంబాయిలో భారతీయ సినిమా జూబ్లీ ఉత్సవాల సందర్భంగా 1939 లో ఫాల్కేకు అయిదువేల రూపాయలు పర్సు బహూకరించారు.1966 లో ఇతని పేరు మీద దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, భారత ప్రభుత్వంచే స్థాపించబడింది. దాదాసాహెబ్ ఫాల్కే సంస్కృత పండితుని కుమారుడు. ఏప్రిల్ 30 1870లో నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లో జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. తనను ఆ వార్త బాగా ఆలోచింపజేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన అతన్ని కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించబోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికంలోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు.ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగిపోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించేవారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఈ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించేవారు. సినిమా బృందం 60-70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి. భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అందజేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు.బొంబాయిలో జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బహుమతి పొందిన తర్వాత ఫాల్కే పేదరికంతోనే స్వగ్రామం చేరుకున్నాడు. దాదాపు అందరూ మర్చి పోయిన తరుణంలో 1944, ఫిబ్రవరి 16 న తుది శ్వాస విడిచాడు. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ అతని జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తినిచ్చేవిగానే ఉన్నాయి. అతని పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, అతని జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచకపోవటం శోచనీయం.

# ప్రజాసేవలో ఘనాపాఠీ...

నీతి, నిజాయతీలకు మారుపేరు, నిబద్ధతకు ప్రతిరూపం ఆయన. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజా నాయకుడు. రాజకీయాల విలువలకు పెద్దపీట వేసి, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న చైతన్యశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ శాసనసభ్యుడు, గ్రంథాలయోద్యమ సారథి, రాష్ట్ర తొలి అధికార భాషా సంఘం అధ్యక్షుడు, బహుగ్రంథకర్త. పోరాట యోధుడు, ప్రజా సేవకుడు. ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఖాదీ దుస్తులతో, చేతిలో ఖాదీ సంచితో నిరాడంబరంగా కనిపించే అజాత శత్రువు.ఆయన గురించి ఎంత రాసినా తక్కువే. ఆయనే ప్రజలు మెచ్చిన నేత...వావిలాల గోపాల కృష్ణయ్య. వావిలాల గోపాలకృష్ణయ్య (సెప్టెంబరు 17, 1906 – ఏప్రిల్ 29, 2003) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు, పద్మ భూషణ పురస్కార గ్రహీత. కళా ప్రపూర్ణ బిరుదు గ్రహీత. 1906 సెప్టెంబరు 17న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వావిలాల నరసింహం, పేరిందేవి దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. పలనాడు పుల్లరి సత్యాగ్రహంలో గార్లపాటి హనుమంతరావు తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘ సభ్యుడిగా ఉంటూ, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావల్సిందేనని పట్టుబట్టారు.1925లోనే సత్తెనపల్లిలో 'శారదానిలయం' అనే గ్రంథాలయాన్ని, వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేశారు. 1974 – 77 కాలంలో తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘ సంయుక్త కార్యదర్శిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సివిక్ బోర్డు సభ్యుడిగా పనిచేసారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి, గెలుపొందారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం ఏర్పడటంతో ఆక్కడ పోటీ చేసి తొలి శాసన సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా గెలిచి 19 ఏళ్ల పాటు ప్రజా సేవలో నిలిచారు. ఆయన కృషి ఫలితంగానే శాతవాహన నూలు మిల్లు, ఫణిదం చేనేత సహకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. సమాజంలో అసమానతలను రూపు మాపేందుకు ఎంతో కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమ సంస్థ బాధ్యుడిగా, గ్రంథాలయ ఉద్యమ రథ సారథిగా, దళిత, గిరిజనోద్ధరణ ఉద్యమ నాయకుడిగా ఆయన ముందు నడిచారు. పద్మభూషణ్‌తో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలను అందుకున్నారు.ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంధాలు రచించిన మేధావి. తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు రచించారు.1922లో 'శివాజీ', 1947లో మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి? 1951లో విశాలాంధ్రం, 1976-77లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం తదితర రచనలు చేశారు. పత్రికా విలేఖరిగా ప్రారంభించి ప్రజా సేవకే సర్వం త్యాగం చేసిన త్యాగశీలి, ధన్య జీవి గోపాలకృష్ణయ్య. సుదీర్ఘమైన ఆయన ప్రజా జీవిత ప్రస్థానంలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం. అన్నిటికన్నా అతి ముఖ్యమైనది నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం ఆయన చేసిన కృషి మరువ రానిది. నాటి ప్రధాని నెహ్రూ చేత ఆ ప్రాజెక్ట్ కు శంఖుస్థాపన చేయించటంలో వావిలాల కృషి మరవ లేనిది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' అనే సత్కారంతో గౌరవించింది. భారత ప్రభుత్వం వీరిని 'పద్మ భూషణ్' బిరుదుతో సత్కరించింది.చివరి రోజులలో ఆనారోగ్యానికి గురై నిమ్స్‌లో కొంతకాలం వైద్యం చేయించుకొన్న ఆయన 2003 ఏప్రిల్ 29న మరణించారు.

# ఘనంగా జన సమితి ఆవిర్భావ వేడుకలు

**హైదరాబాద్,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** తెలంగాణ జన సమితి ఏడవ ఆవిర్భావ వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. అడిక్ మెట్ డివిజన్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కాకునూరి సుధాకర్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు వద్ద ఏర్పాటు చేసిన ఆవిర్భావ వేడుకలలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పార్టీ ఈ ఏడు సంవత్సరాల కాలంలో ఎన్నో అద్భుత విజయాలను సాధించిందని,తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేసిందని అన్నారు. నిరుద్యోగ సమస్యపై,రైతాంగ సమస్యపై ఆర్టీసీ సమస్యల పై,ఆదివాసీల సమస్యలపై పోరాడుతూనే ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం శ్రమించిందని అన్నారు రాష్ట్రంలో కొనసాగుతున్న నియంతృత్వ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి ప్రజలను చైతన్యం చేసిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని



కాపాడుకుంటూ ఉద్యమ ఆకాంక్షల సాధనకు కృషి చేస్తుందని నర్సయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జన సమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్,బీసీ జన సమితి అధ్యక్షుడు



ఎస్.జస్వంత్ కుమార్,జన సమితి నగర ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జయపాల్ రెడ్డి,నాయకులు ప్రేమ్ కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లతో అధికారుల కుమ్మక్కు.. వీరి గారడితో రైతులు బకరా



రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్ ముందు వాహనాలు



మిల్లర్స్ అసోసియేషన్ భవనం వద్ద అధికారుల కార్లు

**అధికారుల హామీలు,ముఖ్యమంత్రి సూచనలు కాగితాలకే పరిమితం..**

**రైస్ మిల్లర్లతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకున్న సంబంధిత అధికారులు..**

**లంచం ఇస్తావా..కేసు చేయమంటావా ..**

**అధికారుల తీరుపై ఆరోపణలు**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లాలో సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లర్లు ఆడుతున్న చదరంగంలో రైతులు బలవుతున్నారు. ఓవైపు రైతులు ఆరుగాలాలు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైస్ మిల్లర్ల చేతిలో అనేక విధాలుగా మోసపోతూ..కాలం కాటేసి వర్షాలకు తడిసిన వడ్లతో కష్టాలలో తడిసి మోపెడవుతుంటే..రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులు కొంతమంది మేకలు,మటన్,చికెన్, ఫుల్ బాటిళ్ళతో దావతులు చేసుకుంటున్నారు. దొరికిన సగం రొట్టె కోసం పిల్లులు కొట్లాడుతుంటే పైనుండి గద్దచ్చి తన్నుకు పోయిన విధంగా రైతులపై రైస్ మిల్లర్లు సంబంధిత అధికారుల పనితీరు కళ్ళకు కొట్టొచ్చినట్లు అగుపడుతుంది..ఏదేమైనా రైతు బాధను పట్టించుకునే నాథుడే లేడు అన్న వాస్తవం చెప్పకనే అర్థమవుతుంది.రైస్ మిల్లర్లు పెద్ద మొత్తంలో మేకలు కోసి సంబంధిత అధికారులకు పార్టీలు ఇవ్వవలసిన అవసరం ఏమొచ్చిందని కొంతమంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై 'సూర్యరేఖ' ప్రతినిధి ,రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్మాస్ కాంతయ్యను వివరణ అడగగా దేవుడి దగ్గర మేకలు కోసి రైస్ మిల్లర్లు దావత్ చేసుకున్నామని,అందులో అధికారులు పాల్గొంటే తప్పు అని డొంక తిరుగుడు సమాధానాలు ఇవ్వడం శోచనీయం..ఓవైపు రైస్ మిల్లర్లు రైతులను మోసం చేస్తుంటే అధికారులు వారికి నియమ నిబంధనలు పెట్టవలసింది పోయి వీరు కూడా వారితో కుమ్మక్కైతే మా బాధ ఎవరితో చెప్పుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**– మామూలు ఇస్తారా..కేసులు పెట్టమంటారా.. అధికారుల తీరు**

మంచిర్యాల జిల్లాలో దాదాపు 90 శాతం రైస్ మిల్లర్లలో సీఎంఆర్ విషయంలో అన్ని అక్రమాలు ఉన్నట్లు గతంలో సివిల్ సప్లై అధికారులు వారి చుట్ట బయటపెట్టారు.ఏ రైస్ మిల్ ఎన్ని కోట్లు బాకీ ఉంది అనేది గతంలో కొన్ని పత్రికలలో సైతం ప్రచురితమైంది. సిఎంఆర్ విషయంలో అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్ల మీద క్రిమినల్ కేసులు పెట్టి రైస్ మిల్లులను సీజ్ చేయాలని డిప్యూటీ కలెక్టర్ సభావాత్ మోతిలాల్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయినా కొంతమంది సంబంధిత అధికారులు అడపా దడప దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తుంది. మామూలు ఇవ్వని రైస్ మిల్లులపై కేసులు చేసి..పార్టీలు, మామూలు ఇచ్చేటటువంటి రైస్ మిల్లుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని సంబంధిత కొంతమంది జిల్లా అధికారులపై ఆరోపణలకు తావులేదు. ఈ రైస్ మిల్లులో ఇన్ని ఆరోపణాలు జరుగుతున్న మిల్లులను సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు పెట్టడంలో అధికారులు ఎందుకు వెనుకడుతున్నారో తెలియవలసింది. ఇప్పటికైనా జిల్లా సంబంధిత అధికారులు రైతుల మేలు కొరకు రైస్ మిల్ బకాయి దారులపై కేసులు పెట్టి చట్టరీత్యాచర్యలు తీసుకుంటారా. ఇలాగే పార్టీలకు, మామూళ్లకు పాల్పడుతూ రైతుల నడ్డి విరుస్తారా వేచి చూడవలసి ఉంది.

## "రాశి "పత్తి విత్తనాలు కొనండి.. అధిక దిగుబడి పొందండి






**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంలో మంగళవారం "రాశి "పత్తి విత్తనాల కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రదీప్ కుమార్ పత్తి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కొత్త రకమైన రాశి హైబ్రిడ్స్ ను రైతుల సమక్షంలో ఆవిష్కరించి పత్తి రైతులకు చీడపురుగు తెగుళ్లపై అవగాహన కల్పించారు.రాశి పత్తి విత్తనాల ద్వారా అధిక దిగుబడి పొందిన రైతులు మాట్లాడుతూ...ఎకరానికి 14 నుండి 18 కింటల్లా దిగుబడి వచ్చిందని,రసం పీల్చే పురుగులను తట్టుకొని పత్తి ఎదగడానికి సులువుగా ఉండటమే కాకుండా పంట తొందరగా చేతికి వచ్చి రెండో పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు. తదుపరి అధిక దిగుబడి పొందిన రైతులను రాశి పత్తి విత్తనాల రీజినల్ మేనేజర్ ప్రదీప్ కుమార్ సన్మానించి ప్రశంస పత్రాన్ని రైతులకు అందజేశారు

## జలమండలిలో పనిచేస్తున్న సివరేజ్ కార్మికులకు జీతాలు ఇప్పించాలని జిఎంకు వినతి..

**వాటర్ వర్క్స్ ఔట్సోర్సింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు పులిమామిడి నారాయణ**

**సబ్బులు,నూనె,టోపీలు ఇవ్వడం లేదని సివరేజ్ కార్మికుల ఆవేదన..**



**ఉప్పల్,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** ఉప్పల్ జలమండలి పరిధిలో పనిచేస్తున్న సివరేజ్ కార్మికులకు జీతాలు ఇప్పించాలని వాటర్ వర్క్స్ ఔట్ సోర్సింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పులిమామిడి నారాయణ ఆధ్వర్యంలో ఉప్పల్ జలమండలి జిఎం.సంతోష్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్మికులకు సబ్బులు, నూనెలు రావడం లేదని జీఎం వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. టోపీలు కూడా ఇవ్వకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా పని చేయిస్తున్నారనే విషయాన్ని యూనియన్ అధ్యక్షుడు పులిమామిడి నారాయణ జనరల్ మేనేజర్ దృష్టికి తీసువెళ్లారు. సృజన్ ఏజెన్సీపే స్లిప్స్ ఇవ్వకుండా వేధిస్తున్న విషయాన్ని కార్మికులు జీఎం వద్ద తమ గోడు వెళ్లబుచ్చారు. ఈ సందర్భంగా జీఎం సానుకూలంగా స్పందించారనే విషయాన్ని యూనియన్ అధ్యక్షుడు నారాయణ కార్మికులకు తెలియచేశారు. జీతాలు ఇచ్చే ఏజెన్సీల టెండర్ల ప్రక్రియ జరుగుతున్న సందర్భంగా వేతనాలు ఆలస్యం అవుతున్నట్లు,జీతాలతో పాటు టోపీలు, ఐడెంటిటీ కార్డు త్వరలో వచ్చేలా చేస్తానని జీఎం చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ కిరణ్,డివిజన్ అధ్యక్షుడు బాబు, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బాలరాజు,శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్,సిద్ధిరాములు,సుధాకర్,కృష్ణ,ఉపేందర్, డివిజన్ కార్మికులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం రైతులకు చుట్టం..

**జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్**



**కామారెడ్డి.ఏప్రిల్ 29,(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం రైతులకీ చుట్టమని,పేదల పాలిట గొప్ప వరమని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆర్ఓఆర్ 2025 చట్టం భూభారతితో సులభంగా పరిష్కారం అవుతుందన్నారు. ధరణి రిజిస్ట్రేషన్ లో పొరపాటు జరిగితే సరిదిద్దుకునే అవకాశం ఉండేది కాదని,ఏదైనా అభ్యంతరాలు ఉంటే రైతులు సివిల్ కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టం మొత్తం పారదర్శకంగా ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో సాదా బైనామతో కొనుగోలు చేసి పట్టా మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్న వారి భూముల సమస్యలు కూడా తీరనున్నాయన్నారు. భూ భారతి చట్టం రైతుల చుట్టమని,భూ వివాదల శాశ్వత పరిష్కారానికి తెచ్చిందే భూ భారతి చట్టమని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా ప్రతి భూమికి భూదార్ సంఖ్య కేటాయింపుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. ఏవైనా భూ సమస్యలు ఏర్పడితే కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ ప్రవేశ పెట్టారని ఎమ్మార్వో,ఆర్డీవో,జేసీ,కలెక్టర్ కు అప్పీలు చేసుకొని సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలోనే అందుతాయన్నారు. ఈ నూతన చట్టంపై రైతులకు,ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు,ప్రజలకు అన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి,ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ,లకు జిల్లా రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# “జమ్మిగడలో సన్నబియ్యం” లబ్ధిదారుని ఇంట భోజనం చేసిన పరమేశ్వర్ రెడ్డి





**సామన్యుడితో కలిసి మెలగడమే ప్రజాప్రభుత్వం ధ్యేయం.!!**

**ఉప్పల్,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** ప్రజాప్రభుత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అమలుచేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం గృహజ్యోతి 200 యూనిట్లు,గ్యాస్ సబ్సిడీ యుఇందిరమ్మ ఇండ్లు,సన్నబియ్యం లాంటి మహోన్నత సంక్షేమ పథకాలను అందుకుంటున్న ఏఎస్ రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ వాస్తవ్యులైన ఏరోళ్ల పద్మ అనే ఓ నిరుపేద లబ్ధిదారుని ఇంటికి చేరుకొని వారింట ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో కూడిన భోజనం ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రభుత్వం కొలువుదీరిన అతితక్కువకాలంలోనే అద్భుతరీతిలో ప్రజాభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజాధారణ పొందుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం చేస్తున్న కృషిపట్ల లబ్ధిదారుని కుటుంబ సభ్యులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి సంతోషాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజిరెడ్డి,ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కాశెట్టి ప్రసాద్, సీతారాంరెడ్డి అల్లూరయ్య పాకాల రాజు మాజీ కౌన్సిలర్ కోర్డినేటర్ రాజేంద్రన్,విట్టల్ నాయక్, అజీజ్,లింగం,భూపాల్ రెడ్డి,శ్రీను,నర్సింహ అనిల్ గుణశేఖర్,రామ్ లింగం,పెద్ది నాగరాజు సందీప్ గౌడ్,కిరణ్,ప్రకాష్,ఉష రాణి,మమ్మడి శ్రీను, రామలింగం,సంకు శ్రీకాంత్,డి.వెంకట్ రావు మొక్క శ్రీను రమేష్ చారి రావు భవాని సంధ్య సునీత మీనా రాణి,ఉమా,ప్రకాష్ రెడ్డి సాయబ్ సలీం,ఖాదర్ వల్లి,దుబాయ్ రావు మల్లారెడ్డి నరేందర్ గౌడ్,బాషా, రహ్మత్ ఉల్లా సంతోష్ చారి శివ,బాల్ నర్షిమా,వినోద్, కృష్ణ ఏఎస్ రావు డివిజన్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లను బాగు చేసి మంచి నీటి వాటర్ లీకేజీలను అరికట్టాలి







**బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ స్వామి యాదవ్ అధికారులకు విజ్ఞప్తి**

**సమస్యలు పరిష్కరించకుంటే జిహెచ్ఎంసి, జలమండలి కార్యాలయాలను ముట్టడిస్తాం..**

**ఉప్పల్,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు ,చిల్కానగర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి సంఘీ స్వామి యాదవ్ పేర్కొన్నారు. చిలుకా నగర్ బాలేందర్ షాపు దగ్గర ప్రాంతంలో రోడ్డు కృంగిపోయి,వాటర్ లైన్ లీకేజీ కారణంగా మంచినీరు రోడ్లపై వృధాగా ప్రవహిస్తుందని తెలిపారు . మల్లికార్జుననగర్ రోడ్ నెంబర్ -5లో డ్రైనేజీ కోసం తీసిన గుంతలు అరకొరగా పూడ్చారని సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని వెల్లడించారు. రోడ్ నెంబర్- 7 లో మిగిలి ఉన్న రోడ్డు అసంపూర్తిగా వేశారన్నారు. రోడ్ నెంబర్- 8 లో డ్రైనేజీ మ్యాన్ హెూల్ కృంగిపోయి మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుందని,ప్రజలు ఇబ్బందులకు గురికావలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కరంగా మారిన ఈ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్, జలమండలి అధికారులకు సంఘీ స్వామి యాదవ్ విజ్ఞప్తి చేశారు.సమస్యలు పరిష్కరించని పక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి జలమండలి కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

# అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

## కాంగ్రెస్ కార్యకర్తలకే ఇండ్లు బిజెపి నేత కొయ్యల ఏమాజి డిమాండ్




**బెల్లంపల్లి,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇవ్వదలచుకున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయని, కాంగ్రెస్ నాయకులు బంధువులుకార్యకర్తల పేర్లే జాబితాల్లో ఉన్నాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి విమర్శించారు. బిజెపి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కల్యాణి ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. నెన్నెల మండల అధ్యక్షులు శేఖర్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయంలో వినతి పత్రం అంద చేశారు.ఈ కార్యక్రమంలో కొయ్యల ఏమాజి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏమాజి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో కాంగ్రెస్ నాయకులు,వారి కుటుంబ సభ్యులు,బంధువుల పేర్లు ఉన్నాయని అన్నారు.అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పేదలు అనేక సంవత్సరాలుగా ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.వారి పేర్లు లేకుండా కాంగ్రెస్ నాయకులు వ్యాపారం చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ నాయకుల పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఏఓకు,నెన్నెల ఎంపిడిఓ కార్యాలయం అధికారికి వినతి పత్రాలు అంద చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి గోవర్ధన్,అసెంబ్లీ కన్వీనర్ సంతోష్,బిజెపి పట్టణ అధ్యక్షురాలు దార కల్యాణి,శ్రావణ్,నవీన్ కుమార్, నర్సింగ్ అరవింద్ స్రవంతి సుమలత శ్రీనివాస్ రాములు రాజయ్య నెన్నెల మండల అధ్యక్షులు శేఖర్,సీనియర్ నాయకులు,శైలేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

### రాంపూర్ లో ఉచిత వైద్య మెగా శిబిరం..



**నిజాంపేట,ఏప్రిల్29(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో రమ్య రిచ్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో బీపీ,షుగర్ థైరాయిడ్,మొదలగు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించామన్నారు.ఈ వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల అందించమన్నారు.వేసవి కాలంలో ఎండ తీవ్రతకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ రావు,హాస్పిటల్ యాజమాన్యం రత్నాకర్,బండి రమ్య,లక్ష్మీపతి,రవీందర్ వెంకన్న స్వామి,తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడి టీచర్ల ముందస్తు అరెస్టులు..




**నిజాంపేట,ఏప్రిల్29(సూర్యరేఖ)**మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లను మంగళవారం ఉదయం నిజాంపేట పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.చాలీ చాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్నామని, ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు కనీస వేతనాన్ని పెంచాలన్నారు.అంగన్వాడి సమస్యలపై హైదరాబాద్ వెళుతున్న తమను పోలీసులు అరెస్టులు చేయడం బాధాకరమని వారు వాపోయారు. అంగన్వాడి టీచర్ల సమస్యలు పరిష్కరించేంతవరకు ఈ పోరాటం కొనసాగిస్తామని ప్రభుత్వానికి వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రేణుక,దుర్గేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి



**ఉప్పల్,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను ఛీబ్ ను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఉదయభాను చీబ్ మేడ్చల్ జిల్లాలో జరుగుతున్న యూత్ కాంగ్రెస్ కార్యక్రమాల వివరాలను శ్రవణ్ కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.గతంలో తాను జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన సమయంలో చేపట్టిన కార్యక్రమాల గురించి ఆయనకు క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### చెస్ చాంపియన్ షిప్ పోటీలను జయప్రదం చేయండి

**మందమర్రి,ఏప్రిల్29(సూర్య రేఖ)** ఆదిలాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించు చెస్ చాంపియన్ షిప్ పోటీలను జయప్రదం చేయాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈగ కనకయ్య,చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కృష్ణ చైతన్య ఆచార్యులు మంగళవారం ప్రకటనలో కోరారు.మే 4 వ తేదీన పట్టణంలోని బురదగూడెంలోని లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో అండర్-7,9,15 బాలబాలికలకు రాష్ట్ర పోటీలకు ఎంపికతో పాటు చెస్ చాంపియన్ షిప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఇందులో గెలుపొందిన క్రీడాకారులు మే 10 వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.ఈ టోర్నమెంట్లో పాల్గొనే క్రీడాకారులు మే 3 వ తేదీలోపు తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు.ఈ టోర్నమెంట్ కు చీఫ్ ఆర్బిటార్ గా అంబాల కల్పన వ్యవహరిస్తారని,టోర్నమెంట్ స్విస్,లీగ్ పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మరిన్ని వివరాలకు కే.కుమార్ మేంద్రపు రవీందర్ లను 8978146456 గల సంప్రదించాలని తెలిపారు.

# భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు





## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్,కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** వేమనపల్లి మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీ రైతు వేదికలో తెలంగాణ భూభారతి చట్టం భూ హక్కుల రికార్డ్ 2025 పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జాయింట్ కలెక్టర్ సభావాత్ మోతిలాల్,లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...భూభారతి చట్టంపై రైతులకు మేలు జరుగుతుందని పెండింగ్లో ఉన్న సాదాభాయ్ నామ వివిధ అన్ని రకాల పనులను సమస్యలను త్వరలోనే పరిష్కారం అన్నారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ఓఆర్ చట్టం ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు.భూ భారతి చట్టంతో రైతు సమస్యలు పరిష్కారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భారతీయ నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యలు పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.భూమి అనేక ఒక రైతు జీవితానికి చాలా పెద్ద ఆధారమని ముఖ్యంగా భూభారత చట్టంలో అప్పీలు వ్యవస్థ చాలా కీలకమైందని తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే అప్పీలు చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చని సూచించారు. గ్రామాలలో చాలా వరకు భూమి హక్కుల గొడవలు ఉంటాయని కానీ భారతిలో రీ సర్వే కొనుగోలు పాలు పంపకాల దాన దస్తవేదులు విరాసతపట్ట మార్పిడికి తప్పనిసరిగా జతపరచడం వల్ల భవిష్యత్తులో భూ గొడవలు ఉండవని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తో కలిసి లబ్ధిదారులకు 19 కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు,ఆర్డీవో హరికృష్ణ తహసిల్దార్ రమేష్ ఎంపీడీవో కుమారస్వామి మాజీ జెడ్పిటిసి రుద్రభట్ల సంతోష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు సయ్యద్ సాబీర్ అలీ అధికారులు తాజా మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్వాన్ యాదవ సంఘం జోలికి వస్తే ఖబడ్దార్

అశోక్ కుమార్ యాదవ్



**మెహిదీపట్నం,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** తాళ్లగడ్డ విశ్వేశ్వర్ నగర్ ప్రాంతములో గల కార్వాన్ యాదవ సంఘం స్థలం జోలికి వస్తే ఖబడ్దార్ అని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్ కుమార్ యాదవ్ అన్నారు.కార్వాన్ యాదవ సంఘానికి చెందిన స్థలంపై కొందరు భూ కబ్జాదారులు కబ్జా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఇలాంటి కుట్రలు ఎన్ని చేసిన తాము తిప్పి కొడతామని పేర్కొన్నారు.ఈ విషయమై కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ మందగిరి స్వామి యాదవ్ తో కలిసి పలువురు ప్రభుత్వ అధికారులను కలిసి ఫిర్యాదు చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్, స్వామి యాదవ్,లు మాట్లాడుతూ కార్వాన్ యాదవ సంఘ శ్రీ కృష్ణా భవన్ పక్కన గల మా యాదవ్ సంఘం స్థలం ఉన్నది.గత 30 ఏళ్ల క్రితం ఈ స్థలం యాదవ్ సంఘంకు కేటాయించడంతో స్థలానికి ప్రహరీ గోడ నిర్మించి గేట్ ఏర్పాటు చేయడం జరిగింది.కాగా కొందరు స్థానిక గూండాలు,భూ కబ్జాదారులు ఈ స్థలంపై కన్నేసి దొంగ పత్రాలు సృష్టించి స్థలాన్ని కాజేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని,ఈ క్రమంలో మా స్థలంపై కరెంట్ మీటర్ పొందేందుకు చేసిన ప్రయత్నాన్ని తాము అడ్డుకోవడం జరిగిందని తెలిపారు.కార్వాన్ యాదవ్ సంఘం స్థలం కోసం ఎవరెన్ని కుయుక్తులు పన్నిన తాము అడ్డుకుంటామని మా స్థలాన్ని మేము కాపాడుకుంటామని వారు పేర్కొన్నారు.

# పరిగిలో భూ భారతిపై అవగాహన సదస్సు







**పరిగి,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా పరిగి మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో భూభారతి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధరణి స్థానంలో రైతులకు ఉపయోగపడే విధంగా భూభారతి అనే కొత్త చట్టాన్ని తీసుకురావడం జరిగిందని,రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్న నేటి నుండి పరిగి తాహసిల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు,రైతుల సమస్యలను తీర్చే విధంగా ఈ చట్టం ఉపయోగపడుతుందని రైతుల సమస్యలపై అధికారులు త్వరితగతిన పరిష్కారం చూపుతారని వివరించారు.గత ప్రభుత్వం ధరణినీ భూస్వాముల పెత్తందారులకు,అనుకూలంగా ఉండే విధంగా తీసుకొచ్చిందని విమర్శించారు కానీ మా ప్రభుత్వం ప్రతి నిరుపేద రైతుకు కూడా అండగా ఉండే విధంగా ఈ చట్టని రూపొందించమని వివరించారు.గ్రామాల వారిగా రెవెన్యూ సిబ్బంది నియమకం కూడా త్వరలో పూర్తవుతుందని వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ...రైతులకు ఏదైనా భూ సమస్యలు ఉంటే మండల తాహసిల్దార్ కార్యాలయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు భూభారతి చట్టంలోని అంశాల గురించి వివరించి భూ భారతి చట్టం పై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాస్తు చంద్ర ,పరిగి తాసిల్దార్ ఆనంద్ రావు,డిప్యూటీ తాహసిల్దార్ నవీన్ కుమార్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి,తాహసిల్దార్ కార్యాలయం సిబ్బంది,,రైతులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సింగరేణి అధికారుల నివాస కార్టర్స్ కేటాయింపు..

పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్



**మందమర్రి,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** సింగరేణి అధికారుల (సూపర్వైజర్స్) నివాస కార్టర్స్ కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా సీనియార్టీ ప్రకారం క్వార్టర్స్ కేటాయించడం జరిగిందని పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్ తెలిపారు.సింగరేణి సంస్థలో ఉద్యోగాలు చేస్తున్న మందమర్రి ఏరియాలోని సూపర్వైజర్స్ కు కేటాయించబడిన క్వార్టర్లను ఎంపిక చేసుకోవడానికి అందుబాటులో ఉన్న క్వార్టర్ల ఆధారంగా కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో క్వాటర్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ కౌన్సిలింగ్ కు మందమర్రి ఏరియాకు 20 క్వాటర్స్ ప్రకటించగా,10 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా సీనియార్టీ ప్రకారం 8 మంది ఏరియ సూపర్వైజర్ ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్ పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్,డివైపిఎం మైత్రేయ బంధు మేనేజ్మెంట్ ట్రైని ఐఈడి శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో అలరించిన భరతనాట్య ప్రదర్శన



**ఉప్పల్,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** ఉప్పల్ మినీ శిల్పారామంలో మంగళవారం ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా రమాదేవి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో పుష్పాంజలి జతిస్వరం మల్లరి కొండలలో నెలకొన్న,మైసూర్ జతి కృష్ణ అష్టకం,గజవదనం,నర్తన గణపతిమ్ నటేశ కౌతం,కంజదళయాదాక్షి,తిల్లాన అంశాలను శరణ్య, కాశ్వీ ఇషాన్వి రిధి రావు సోమశ్రీ ధన్విక మిహిర ప్రయేక్ష రియన్ని కార్తీక శ్రీకరీ సాత్విక వైష్ణవి,మోక్షిత లహరి శివాని అనికా మొదలైన వారు ప్రదర్శించారు.

## కార్వాన్ నియోజక వర్గంలో భారతీయ జనత పార్టీని బలోపేతం చేద్దాం..



**మెహిదీపట్నం,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ కార్వాన్ నియోజక వర్గం ముఖ్య నేతల సమావేశం లంగర్ హౌస్ డివిజన్ లోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో కార్వాన్ నియోజక వర్గం ముఖ్య నేతల సమావేశం కార్వాన్ నియోజక వర్గం కన్వీనర్ ఆకుల గోవర్ధన్ అధ్యక్షత జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా గోల్కొండ జిల్లా ప్రాభారీ అట్లూరి రామకృష్ణ హాజరై కార్వాన్ నియోజక వర్గంలో భారతీయ జనత పార్టీని బలో పేతం చెయ్యడానికి సంస్థాగత విషయాలు చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా అట్లూరి రామకృష్ణను లంగర్ హౌస్ డివిజన్ అధ్యక్షులు డి.శ్రీకాంత్,గోల్కొండ డివిజన్ అధ్యక్షులు గంప సతీష్ కుమార్,లు శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది.

## కోతులను తరిమేసేందుకు జిఎం కార్యాలయంలో కొండముచ్చు ఫోటో..




కొండెంగ ఫ్లెక్సీ తో సత్ఫలితాలు ఇచ్చేనా.. ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో కోతుల బెడదను నివారించేందుకు సింగరేణి అధికారులు వినూత్న ఆలోచన చేశారు.వానరులను నియంత్రించేందుకు కార్యాలయ ప్రధాన ద్వారంలో ఆకట్టుకునేలా కొండముచ్చు (కొండెంగ) ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.ఇళ్లలోనే కాదు కార్యాలయాల్లో కూడ వాటి ఉనికిని చాటుతున్న నేపథ్యంలో కోతుల బెడదను అరికట్టేందుకు అధికారులు ఈ ఉపాయం చేశారు.పరిష్కారం కొరకు చేసిన చిన్ని ప్రయత్నం సత్ఫలితాలు ఇస్తుందో లేదో వేచి చూడాలి.

# మే 20వ తేదీన దేశవ్యాప్త సర్వత్రిక సమ్మె..






**44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చినందుకు వాటిని తీసివేయాలి..**

**బెల్లంపల్లి,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు అప్పజెప్పకుండా జాతీయకరణ చేయాలని,బొగ్గు గులాకుల వేలంపాటను రద్దుచేసి నేరుగా బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పచెప్పాలని టిఎన్ టియుసి ప్రధాన కార్యదర్శి టి.మణిరాం సింగ్ అన్నారు.టిఎన్టియుసి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సింగరేణి యువక్తంగా సింగరేణి యజమాన్యానికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం నెలకు 26,000 కంటే తగ్గకుండా జీవోను వెంటనే విడుదల చేయాలని,సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనంకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి నాయకులు కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## చిన్న,సన్న కారు రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయంలో డిజిటల్ విప్లవం తీసుకురావాలి










**తెలంగాణ ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి**

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** దేశంలో వ్యవసాయంలో చిన్న,సన్నకారు రైతుల నిడదొక్కు నేలా ఉండేందుకు వెంటనే సాంకేతిక మద్దతు, అలాగే డిజిటల్ పద్ధతులను ఆపాదించాల్సిన అవసరం ఉందని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సోమాజిగూడలో సిఐఎల్ఎల్ ఆధ్వర్యంలో జరిగిన అగ్రి విజన్ 2025లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు.చిన్న స్వర్ణకారుల వ్యవసాయాన్ని బలోపేతం చేస్తేనే భవిష్యత్తులో ఎదురయ్యే పర్యావరణ మార్పులను దీటుగా తట్టుకోగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు టెక్నాలజీ ఆధారిత అనువర్తనాలను వ్యవసాయంలో సుస్థిరత,ఉత్పాదకత పెంపుకు వాడుకోవాలని కోరారు.పంటల బేవిద్ధీకరణను పెంపొందించే పెంపొందించాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. సంస్థలు ఆవిష్కరణలను ప్రభుత్వ పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తే రైతులకు తొందరగా చేర్చవచ్చని తెలిపారు.భవిష్యత్తులో ఎంత ఆశాజనకంగా కనిపిస్తున్న ఉద్యాన పంటల్లో కోత అనంతరం వెద్దాల తగ్గింపుకు డిజి టల్ అప్లికేషన్స్ అవసరమని ఆదిశగా పరిశోధ న ముమ్మలం చేయాలని కోరారు. రాష్ట్రంలో కొరతగా ఉన్న కూరగాయలు నూనె గింజలు అపరాల పంటలను వైవిద్దీకరణలో భాగంగా భారీగా ప్రోత్సహించాలని తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయం సాగు నీటి అందుబాటు,నేలల్లో బలం పర్యావరణంలో మార్పుల పైనే ఆధారపడి ఉంటుందని వీటిని చాలా జాగ్రత్తగా తీసుకో వాల్సిన అవసరం ఉందని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు.

# కాత్రియాలలో మెగా హెల్త్ క్యాంప్ సక్సెస్







**260 మందికి ఉచిత పరీక్షలు.**

**రోగులకు మందుల పంపిణీ..**

**రామాయంపేట,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** రామయంపేట మండల పరిధి కాత్రియాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి నిర్వహణలో చేపట్టిన శిబిరంలో 260 మందికి ఉచిత పరీక్షలు చేశారు.ప్రత్యేక వైద్యులు చేరుకొని ఈసీజీ,బీపీ షుగర్ పరీక్షలతో పాటు,మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు యాదగిరి సుందర్ సింగ్ చింతల గంగాధర్ కాత్రియాల మాజీ సర్పంచ్ శ్యాములు బీఆర్ఎస్ నాయకులు శ్యామ్ రెడ్డి, రాజు సేటులతోపాటు రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటివ్ నెంబర్లు,చంద్ర బోస్,మద్దెల సత్యం,డీలర్ శ్రీను మల్లారెడ్డి ఆసుపత్రి హెల్త్ క్యాంపు నిర్వహకులు రవిశంకర్ ఉన్నారు.

### రైస్ మిల్ ను సందర్శించిన తహసిల్దార్ రమ్యశ్రీ..



**నిజాంపేట,ఏప్రిల్29(సూర్యరేఖ)**రైస్ మిల్లులకు ధాన్యం తరలించేటప్పుడు జాగ్రత్తలు చేపట్టాలని నిజాంపేట తాహసిల్దార్ రమ్య శ్రీ అన్నారు.ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట సదాశివ ఇండస్ట్రీ రైస్ మిల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీలను త్వరతగతిన అన్ లోడ్ చేసిపంపించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. రైతుల కూడా వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ప్రీతి తహసిల్దార్ స్టాప్ రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అదనపు కలెక్టర్ కు వినతిపత్రం..



**రామాయంపేట,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** రామాయంపేట మున్సిపాలిటి పరిధిలోని గొల్పర్తి 7వ వార్డుకు చెందిన ప్రజలు జాతీయ రహదారి 44 పై అధ్య హెూటల్ ఏదురుగా క్రాసింగ్ వద్ద రేలింగ్ ఏర్పాటు చేయవద్దని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ ప్రజలు మాట్లాడుతూ...మా గోల్పర్తి గ్రామ ప్రజల వ్యవసాయ భూములు జాతీయ రహదారి అవతలి వైపునే ఉన్నాయని అక్కడికి వెళ్లడానికి తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతామని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఎవరైనా చనిపోయిన వారిని కూడ అక్కడ ఉన్న మా భూముల్లోకి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. సుమారుగా 2 వేల మంది గ్రామస్థులకు సంబందించిన అన్ని రకాల వ్యవసాయ భూములు అక్కడే ఉన్నాయని పేర్కొన్నారు.జాతీయ రహదారి రోడ్ నెంబర్ 44 క్రాసింగ్ వద్ద రెలింగ్ ఏర్పాటు చేయవద్దని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ అధికారులు మమ్మల్ని బలవంతము చేసి రేలింగ్ ఏర్పాటు చేసినట్లయితే దాదాపు 2 వేల మంది గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు.ఈ విషయంలో మున్సిపాలిటీ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారి విస్తరణ అధికారులతో తమరు మాట్లాడి ఆద్య హెూటల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తమకు న్యాయం చేయాలని గోల్పర్తి గ్రామస్తులు అదనపు కలెక్టర్ ను వేడుకున్నారు.

### బాలాజీ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలించిన తహసిల్దార్..



**రామయంపేట,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** రామాయంపేట మండలం దామరచెరువు గ్రామ శివారులో ఉన్న బాలాజీ రైస్ మిల్లును మండల తహసిల్దార్ రజనీ కుమారి సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రామాయంపేట మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న దాన్యము రైస్ మిల్లులకు వచ్చిన వెంటనే రైస్ మిల్ యాజమానులు వెంటనే డంపు చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా రైస్ మిల్ యాజమాన్యాలు హమాలి కార్మికులకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి వారి దాహర్తిని తీర్చాలని పేర్కొన్నారు.అలాగే రైస్ మిల్లులో ధాన్యం డంపు చేసిన నిల్వ వివరాలను రిజిస్టర్లను పరిశీలించినట్లు వెల్లడించారు.అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని మిల్లు యాజమాన్యులు వరి ధాన్యాన్ని వచ్చిన వెంటనే డంపు చేసుకొని నిల్వ ఉంచాలని సూచించినట్లు తెలిపారు.

# మూగజీవాల రోదన..పట్టింపు ఎవరిది







**శిథిలావస్థలో రామాయంపేట పశు వైద్యశాల..**
**బిక్కుబిక్కుమంటు కార్యాలయంలో కూర్చుంటున్న డాక్టర్లు..**

**రామాయంపేట,ఏప్రిల్ 29 (సూర్యరేఖ)** మనుషలకు సమస్య వస్తే చెప్పుకోవడానికి మాటల ద్వారా చెప్పొచ్చు..కానీ మూగజీవాల రోదన ఎవరికి పట్టింపు అనే చందంగా మారింది.రామాయంపేట పశు వైద్యశాల,ఉమ్మడి రామయంపేట మండలంలో ఎన్నో ఏళ్లుగా పశు వైద్యశాల ఉన్నది.చుట్టుపక్కల గ్రామాల గ్రామాల పశువులతో పాటు,గొర్రెల కాపరులు పశువులకు ఏవైనా వ్యాధులు సోకితే రామయంపేటకు వచ్చి వైద్యం చేయించుకొని వెళ్లేవారు.పశువైద్య డాక్టర్లు సైతం గ్రామాల్లో గాలికుంట,నట్టల నివారణ టీకాలు గ్రామాలకు వెళ్లి అందించేవారు.కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.ఒకవైపు శిథిలావస్థకు చేరి చెత్తాచెదారం నిండిపోయి రెండు మూడు గదులు నిరుపయోగంగా ఉంచారు.ఉన్న ఒక గదిలో పైసలు కందించి టీకాలతో పాటు మందులు ఉంచి పక్కనే ఒక కుర్చీ వేసుకొని కూర్చునే పరిస్థితి నెలకొంది.ఈ మధ్యకాలంలో కనీసం పశు వైద్యశాల ఉందనే విషయాన్ని సైతం మర్చిపోయే విధంగా తయారయింది.పశు వైద్య చికిత్సల కోసం వచ్చినవారు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయో లేవు అర్థం కాని పరిస్థితి దాపురించింది ఇదిలా ఉండగా గతంలో గ్రామ గ్రామాన పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధుల బారిన పడ్డ గొర్రెలు,మేకలు,పశు వులకు వైద్యం చేసేవారు. కానీ ఇప్పుడు అలాంటి శిబిరాలు ఎక్కడ కూడా జరగడం లేదు.పశు జాతితో పాటు గొర్రెలు మేకలు పెంపుడు కుక్క లు కనుమరుగవుతున్న తరుణంలో ఉన్న వాటిని ఏ వ్యాధులు సోఖకుండా కాపాడుకోవడానికి రైతులు తమ వంతు కృషి చేస్తున్న ఫలితం లేకుండా పోతుంది. పశు వైద్యాధికారులు అందుబాటులో ఉండి వ్యాధులకు అవసరం ఉన్న మందులు సిద్ధంగా ఉంచితేనే ఏ వ్యాధులు వచ్చిన వాటిని నివారించుకొని వాటిని కాపాడుకోవడానికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు ప్రజలు కోరుతున్నారు. అలాగే వన్యప్రాణులు గాయపడ్డ, అస్వస్థతకు గురి అయిన సమయానికి వైద్యం అందడం లేదని విమర్శలు వస్తున్నాయి.ఇటీవల తోనిగండ్ల గ్రామ శివారులో కృష్ణ జింకను ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలుపగా వెటర్నరీ డాక్టర్ను తీసుకొని ఘటన స్థలానికి చేరుకునేలాగా ఆ కృష్ణ జింక్ అభివృద్ధి చెందింది.ఇదొకటే కాకుండా వన్య ప్లాన్లు గాయపడ్డ అశ్వసగురైన సకాలంలో చికిత్సలు అందిస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు.

**అందుబాటులో ఉంటున్నాం..కానీ భయం గుప్పెట్లో వెటర్నీ ఏడి తిరుపతి**

మేము ఎల్లప్పుడూ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటున్నాం..కానీ భవనం శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న గోడౌన్ లో విధులు నిర్వహించడం జరుగుతుంది.శిథిలవస్తులు ఉన్న భవనం గురించిపై అధికారులకు తెలపడం జరిగింది.అలాగే పశువులతో పాటు అస్వస్థతలకు గురైన వన్యప్రాణులకు సరైన సమయంలో వైద్యం అందించడం జరుగుతుంది.

## మే 2వ తేదీన ఐజి ఆధ్వర్యంలో ఫైరింగ్ రేంజ్ ప్రారంభోత్సవం





**ఫైరింగ్ రేంజ్ ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి**

**మెదక్,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం మాట్లాడు తూ..మెదక్ జిల్లా నార్సింగి గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఫైరింగ్ రేంజ్ పనులు పూర్తి అయ్యి ఐజి ఆధ్వర్యం లో ప్రారంభోత్సవానికి సిద్ధమౌ తుందని అన్నారు. గతంలో ఫైరింగ్ ప్రాక్టీస్ కొరకు వేరే జిల్లా లోని ఫైరింగ్ రేంజ్ కు వెళ్లాల్సి వచ్చేది అని అన్నారు.మెదక్ జిల్లా పోలీస్ సిబ్బందికి ఫైరింగ్ రేంజ్ కల సహకారం కాబోతుందిని అన్నారు. మే 2 తారీకున ఐజి చేతుల మీదగా ప్రారంభో త్సవం చేయడం జరుగుతుందని ఈ సందర్భం గా తెలిపారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ వెంకటరాజాగౌడ్, ఆర్ఐ శైలేందర్,ఎస్సై,లు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే గోడ ప్రతుల ఆవిష్కరణ..

**అమర వీరుల స్ఫూర్తిగా మేడేను ఘనంగా నిర్వహించుకోవాలి..**
**బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ**




**మందమర్రి,ఏప్రిల్ 29(సూర్యరేఖ)**ప్రతి ఒక్క ఉద్యోగి అనుభవిస్తున్న ఎనిమిది గంటల పని దినాన్ని సాధించిన అమర వీరుల స్ఫూర్తిగా మేడేను కార్మికులందరూ కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు.139వ మేడే ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఏరియాలోని ఏఐటియుసి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన వారి కష్టాలను గుర్తు చేస్తూ వారి సేవలకు నివాళి అర్పించే విధంగా ముద్రించిన గూడ ప్రతులను ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ...చికాగో అమరవీరుల త్యాగంతో ఏర్పడిన ఎర్రజెండా యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న మేడే వేడుకల్లో భాగంగా ఏరియాలోని అన్ని డిపార్ట్మెంట్లు,గనులపై కార్మికుల అందరి సమక్షంలో ఉదయం ఏడు గంటలకు జెండాలు ఎగరవేసి,9 గంటల వరకు యూనియన్ కార్యాలయం వద్దకు రావాలని కార్మికులను కోరారు. ఆనాడు ఎనిమిది గంటల పని దినం కోసం చికాగో నగరంలో కార్మికులందరూ సంఘటితమై యాజమాన్యాలకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రదర్శన కారులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో అనేకమంది కార్మికుల ప్రాణాలు పోవడం జరిగిందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్,బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ముల్కలపల్లి వెంకటేశ్వర్లు,పిట్ సెక్రటరీలు, ముఖ్య కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్ మోహన చొరవతోనే లింగంపేట మండలం భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ ఎంపిక..



**కామారెడ్డి,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** లింగంపేట మండల ప్రాంతం భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ ఎంపిక చేసినందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీనివాస్ రెడ్డి,లకు ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే మదన్ మోహన్ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ...ధరణి పోర్టల్ వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా నియోజకవర్గ రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.భూభారతి చట్టం తేవడంతో రైతుల భూమి సమస్యలు తొలగిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. లింగంపేట మండలం భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక అయిన విషయం తనకు తెల్వగానే చాల సంతోషం కలిగిందని ఎమ్మెల్యే అన్నారు.ఎల్లారెడ్డి చరిత్రలో రెవెన్యూ మంత్రి రావడం ఇదే మొదటిసారి అని తెలిపారు.అతి తక్కువ సమయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా రైతుల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు.మంత్రి మాట్లాడుతూ. లెక్టర్లు,రైతులతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాత ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు.ప్రజల నుండి స్వీకరించిన సలహాలను కూడా ఈ చట్టంలో పరిగణనలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ చట్టం అమలుకు ముందుగా,నాలుగు ప్రాంతాల్లో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంచుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన చొరవతోనే లింగంపేట మండలం పైలట్ ప్రాజెక్ట్ ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టుల ద్వారా భూ సమస్యలను పరిశీలించి,రైతుల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులను తీసుకొచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రంలో జిల్లా కలెక్టర్,ఎల్లారెడ్డి ఆర్డీఓ,జాయింట్ కలెక్టర్,మార్కెట్ కమిటీ చైర్మన్ లు ప్రభుత్వ అధికారులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,యూత్ అధ్యక్షులు మహిళా నాయకులు,కార్యకర్తలు,శెట్పల్లి చుట్టూ పక్కన ఉన్న గ్రామస్థులు రైతులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి..

### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**కామారెడ్డి,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** రైతుల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు.మంత్రి మాట్లాడుతూ...కలెక్టర్లు,రైతులతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాత ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు.ప్రజల నుండి స్వీకరించిన సలహాలను కూడా ఈ చట్టంలో పరిగణనలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ చట్టం అమలుకు ముందుగా నాలుగు ప్రాంతాల్లో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంచుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన చొరవతోనే లింగంపేట మండలం పైలట్ ప్రాజెక్ట్ ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టుల ద్వారా భూ సమస్యలను పరిశీలించి,రైతుల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులను తీసుకొచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రంలో జిల్లా కలెక్టర్,ఎల్లారెడ్డి ఆర్డీఓ,జాయింట్ కలెక్టర్,మార్కెట్ కమిటీ చైర్మన్ లు,ప్రభుత్వ అధికారులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,యూత్ అధ్యక్షులు,మహిళా నాయకులు,కార్యకర్తలు శెట్పల్లి,చుట్టూ పక్కన ఉన్న గ్రామస్థులు,రైతులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ఎజెండా





**ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవతో పని చేస్తా..**
**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**నార్సింగి,ఏప్రిల్29(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పని చేస్తున్నానని శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో రూ.2.93 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనంనకు ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అందరికీ ఉపయోగపడేలా 500 గజాల స్థలంలో భవనం నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పని చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు మంచినీరు రోడ్లు వీధిదీపాలు,డ్రైనేజీ పారిశుధ్యం ఇలా ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని మునుముందు మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన పనులు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాలు గ్రామాలు మున్సిపాలిటీలో అంచెలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.



ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ చేర్మెన్ వేణు గౌడ్ గుడిమల్కాపూర్ మార్కెట్ చెర్మెన్ మల్లేష్,పార్టీ అధ్యక్షులు అశోక్ యాదవ్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ వెంకటేష్ యాదవ్ ఖానాపూర్ మాజీ సర్పంచ్ నర్సింహా మాజీ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు,రైతులు ఉన్నారు.

## వేలం పాటను సద్వినియోగించుకోవాలి

### మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్,ఏప్రిల్29(సూర్యరేఖ)** తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను వేలంపాట వేస్తున్న నేపథ్యంలో ఆసక్తి కలిగిన వారు సద్వినియోగించుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీస్ వాహనాలకు ఉపయోగించిన విడి భాగముల,టైర్స్,బ్యాటరీల వేలం పాటలో ఆసక్తి గలవారు పాల్గొనాలని సూచించారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ వాహనాలకు వాడబడినటువంటి కాల పరిమితి పూర్తి అయిన టైర్లు,బ్యాటరీలు,విడి భాగాలను మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న పాత ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో మే 5 వ తేదీన ఉదయం 10 గంటలకు వేలంపాట వేయడం జరుగుతుందన్నారు.కావున ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొని,ఈ వాహనాల టైర్లు,బ్యాటరీలు,విడిభాగాలను తమ స్వంతం చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు రిసర్వ్ ఇన్స్పెక్టర్ శైలందర్ ను 8712657912 సంప్రదించాలని తెలిపారు.



# డివిజన్ లో రోడ్ల వ్యవస్థ పటిష్టానికి చర్యలు





**సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి..**
**మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం..**
**బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,ఏప్రిల్29(సూర్యరేఖ):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో రోడ్ల వ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్ర నగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. స్థానికంగా రోడ్ల వ్యవస్థను పటిష్టం చేసేందుకు చొరవ చూపుతున్నామన్నారు. ప్రధాన రహదారుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వివరించారు.డివిజన్ ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సమస్యలు ఎదురైనా తన దృష్టికి తేవాలని,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. జిహెచ్ఎంసి అధికారులు కాంట్రాక్టులతో మాట్లాడి అధికారులకు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహమూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ బిజెపి సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి బబ్లు జనార్దన్ రెడ్డి,శశిధర్ రెడ్డి,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి శ్రావణ్,శంకర్ రెడ్డి, శ్రీనివాస్,సతీష్,కాంట్రాక్టర్ నాయక్,స్థానిక బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి




**చేగుంట,ఏప్రిల్29(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంటలో సైబర్ నేరాలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్సై రాంబాబు,ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలో ఉన్న ప్రజలు,ఎవరు ఏమి ఫోన్ చేసినా,ఓటిపి చెప్పకూడదని అన్నారు.ఎవరైనా సైబర్ నేరాలకు మోసపోతే అందుబాటులో ఉన్న పోలీసుస్టేషన్ కు కానీ,1930 కు కానీ ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీ చైతన్య రెడ్డి,బిక్య నాయక్ ఎస్సై2,ఏఎస్సై రాంబాబు,రవీందర్,కానిస్టేబుల్ వెంకటేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన బిజెపి నాయకులు



**చేగుంట,ఏప్రిల్29(సూర్య రేఖ)** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని బిజెపి పార్టీ నాయకులు అన్నారు.మంగళవారం చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులను బిజెపి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు ఇబ్రహీంపూర్ బిజెపి గ్రామ కమిటీ తరపున ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెదరమైన నాగభూషణం,ఈద స్వామి,బూత్ అధ్యక్షులు మానికరి రమేష్,బిజెపి జనరల్ సెక్రెటరీ గుర్రాల వంశీకృష్ణ,మహిళా మోర్చా ఎర్రగుల పద్మ,బెదరమైన స్వామి సత్తయ్య భాను,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి



**చేగుంట,ఏప్రిల్29(సూర్య రేఖ):** చేగుంట మండలంలోని చిన్న శివనూర్,కర్నాల్ పల్లి,గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించి పంట సేకరణ రిజిస్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు పారదర్శకత పాటించాలని,కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు హమాలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు లారీల కొరత ఉన్నందున రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణ చేసుకుంటే అద్దె చెల్లిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్ ఆర్ఐ జై భారత్ రెడ్డి,నిర్వాహకులు రైతులు తదితరులు ఉన్నారు.

## 30న టెన్త్ రిజల్ట్స్

**హైదరాబాద్ :** తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదలకు రంగం సిద్ధమైంది. ఒకటి రెండు రోజుల్లోనే రోజుల్లోనే రిజల్ట్స్‌ను విద్యాశాఖ ప్రకటించనున్నట్లు సమాచారం. విడుదల తేదీని ఖరారు చేయాలని కోరుతూ పరీక్షల విభాగం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలుస్తోంది. అట రేవంత్ రెడ్డి ఆమోదం లభించగానే ఫలితాలను విడుదల చేస్తారు. త్వరలో అధికారికంగా ఫలితాల విడుదల తేదీ ఖరారు కానుంది. అనంతరం వెంటనే తెలంగాణ ట్రిపుల్ఐటీ నోటిఫికేషన్ 2025 విడుదల కానుంది.10వ తరగతిలో మంచి మార్కులతో పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజల్ట్స్ చెక్ చేసుకోవడానికి డైరెక్ట్ లింక్ ఇదే.పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఎస్ఎస్‌సీ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. విద్యార్థి దశలో 10వ తరగతి పరీక్షలు భవిష్యత్తుకు ఎంత కీలకమైనవో మనందరికీ తెలిసిందే. కెరీర్‌కు పునాదులు వేసుకునే క్రమంలో పదో తరగతి అనేది ఎంతో కీలకమైంది. అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు టెన్త్ పబ్లిక్ పరీక్షలంటే ఎంతో శ్రద్ధ చూపెడతారు..ఫలితాల అనంతరం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు.. అందుకే.. పదో తరగతి ఫలితాలపై ఎప్పుడూ ఉత్కంఠ ఉంటూనే ఉంటుంది. ఈక్రమంలో తెలంగాణ పదో తరగతి ఫలితాలు ఎప్పుడు విడుదలవుతాయా అని విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# బిజినెస్

## భద్రత కోసం రూ.70 కోట్లు! సుందర్ పిచాయ్ జీతం ఎంతంటే?



ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల సీఈఓల గురించి తెలుసుకునే చాలామంది.. మొదట సెర్చ్ చేసే విషయం జీతమే. ఎందుకంటే వారి వేతనాలు కోట్ల రూపాయల్లో ఉంటాయి. ఇప్పుడు తాజాగా 2024లో సుందర్ పిచాయ్ జీతానికి సంబంధించిన విషయాలు వెల్లడయ్యాయి. దీని గురించి మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ఆల్ఫాబెట్ 2025 ప్రాక్సీ స్టేట్‌మెంట్ ప్రకారం, సుందర్ పిచాయ్ వేతనం 2024లో 10.73 మిలియన్ డాలర్లు (రూ. 91.4 కోట్లు). ఇందులో ఎక్కువ భాగం స్టాక్ అవార్డ్స్, ఇతర పరిహారాల రూపంలో అందింది. కాగా ఈయన బేసిక్ శాలరీ 2 మిలియన్ డాలర్లు (రూ. 17.04 కోట్లు). సాధారణ ఉద్యోగి జీతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. 2023లో పిచాయ్ వేతనం 8.8 మిలియన్ డాలర్లు మాత్రమే. జీతం విషయం పక్కన పెడితే.. సుందర్ పిచాయ్ భద్రత కోసం ఆల్ఫాబెట్ కంపెనీ ఏకంగా 8.27 మిలియన్ డాలర్లను (రూ. 70.45 కోట్లు) ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అంతకు ముందు ఏడాది సంస్థ భద్రత కోసం చేసిన ఖర్చు 6.78 మిలియన్ డాలర్లు. అంటే సెక్యూరిటీ కోసం.. కంపెనీ అంతకు ముందు సంవత్సరం కంటే 22 శాతం ఎక్కువ ఖర్చు చేసింది. కంపెనీ అందించే భద్రతా ప్యాకేజీలో.. ఇంటి నిఘా, ప్రయాణ రక్షణ, వ్యక్తిగత డ్రైవర్లు వంటివన్నీ ఉంటాయి. అయితే దీనిని సంస్థ సుందర్ పిచాయ్ వ్యక్తిగత ప్రయోజనంగా కాకుండా.. ఉద్యోగ భద్రతలో భాగంగానే భావిస్తుంది. నిజానికి, సీఈఓ సుందర్ పిచాయ్ జీతం సగటు ఉద్యోగి జీతం కంటే దాదాపు 32 రెట్లు ఎక్కువ.

## ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం మరో 195 మంది ట్రైనీలు




2025లోనూ లేఆఫ్స్ పర్వం కొనసాగుతూనే ఉంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ వరుస తొలగింపులు చేపడుతూనే ఉంది. తాజాగా మరో 195 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ ఏడాదిలోనే ట్రైనీలను తొలగించడం వరుసగా నాలుగోసారి కావడం గమనార్హం. ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా 195 మందిని తొలగించినట్లు తెలుస్తోంది. వీరందరికీ కంపెనీ ఈ మెయిల్స్ ద్వారా సమాచారం అందించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 2025 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు సంస్థ సుమారు 800 మంది ట్రైనీలను తొలగించింది. భారతదేశంలో రెండవ అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఏప్రిల్ 18న దాదాపు 240 మందిని తొలగించగా, అంతకు ముందు ఫిబ్రవరిలో 300 మందికి పైగా ట్రైనీలను, మార్చిలో 30 నుంచి 35 మందిని తొలగించింది. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా సంస్థ అందిస్తోంది. ఇన్ఫోసిస్ కంపెనీ తొలంగించిన ట్రైనీలందరినీ.. 2022లో నియమించుకుంది.

# ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక




**మందమర్రి,ఏప్రిల్ 29(సూర్యరేఖ)** మందమర్రి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు మండలంలో చేపట్టిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా అధికారులు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో జిల్లా డీఆర్డీఏ పీడీఎస్ కిషన్ సమక్షంలో మండలంలోని 10 గ్రామ పంచాయితీల్లో జరిగిన పనులపై మండలంలోని గ్రామాల్లో చేపట్టిన పనుల నాణ్యత,పని సమయం,కూలీల హాజరును క్షుణ్ణంగా పరిశీలించారు.మండలంలోని పది గ్రామ పంచాయతీల పరిధిలో 1 ఏప్రిల్ 2024 నుండి 2025 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా 2015 పనులు చేపట్టగా కూలీలకు రూ.3.34 కోట్ల చెల్లించారు.వీటిపై గత వారం రోజులుగా సామాజిక తనకి బృందం సభ్యులు గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించి పూర్తి నివేదికను ప్రజావేదికలో వెల్లడించారు.ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు కొలతలు తప్పులుగా నమోదయ్యాయని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు నిర్ధారించిన పనులకు వ్యత్యాసం ఉండడంతో పలువురు సిబ్బందికి జరిమానా విధించారు.ఈ సందర్భంగా డీఆర్డీఏ పిడిఎస్ కిషన్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అమలవుతున్న జాతీయ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి,లోపాలను గుర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు ఇలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అంతేకాకుండా పనులకు సంబంధించిన వివరాలను రికార్డులలో నమోదు చేయాలని అధికారులను సిబ్బందిని ఆదేశించారు.ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అంబుడ్స్ మెన్ దామెర శివరాం,విజిలెన్స్ అధికారి కిరణ్,ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్, చెన్నూరు క్లస్టర్ ఏపీ డి మాధవి,స్టేట్ రిసోర్స్ పర్సన్ కుమార్, ఏపీవో రజియా సుల్తానా,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీ ధర పలుకుతున్న బంగారం! అక్షయ తృతీయ రోజున భారీ కొనుగోళ్లు జరిగేనా?



భారతీయులకు బంగారం ఎంటే ఎంతో మక్కువ. వివాహాలు, ఇతర శుభాకార్యాల సమయంలో పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా అక్షయ తృతీయ రోజున పెద్ద ఎత్తున పసిడిని కొనుగోలు చేస్తుంటారు. అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు సెంటిమెంట్‌గా మారింది. ప్రస్తుతం, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. గత కొద్దిరోజులుగా ధరలు గణనీయంగా తగ్గుతూ వచ్చాయి. వ్యాపారులు లాభాల స్వీకరణకు దిగడం, డాలర్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులున్నాయి. అయినప్పటికీ అక్షయ తృతీయ రోజున భారతీయులు పెద్ద సంఖ్యలో బంగారం కొంటారని బులియన్ మార్కెట్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలుదారులు అవసరానికి అనుగుణంగా ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారని.. తేలికపాటి ఆభరణాల నుంచి గోల్డ్ ఈటీఎఫ్స్, డిజిటల్ గోల్డ్, బార్‌లతో సహా కాయిన్స్ వరకు వివిధ రకాలుగా బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ నెల 30న అక్షయ తృతీయ రోజున ధరలను పరిశీలించి బంగారం కొనాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవచ్చని ఆభరణాల వ్యాపారులు పేర్కొంటున్నారు. పీఎన్‌జీ జ్యువెల్లర్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ గాడ్గిల్ మాట్లాడుతూ.. బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ.. వినియోగదారుల సెంటిమెంట్ బలంగానే ఉందని పేర్కొన్నారు. అక్షయ తృతీయ రోజున బంగారం అమ్మకాలు పెరుగుతాయని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే, అధిక ధరలు గత సంవత్సరంతో పోలిస్తే వాల్యూమ్ వృద్ధిని తగ్గించవచ్చని.. విలువ పెరుగుదల కారణంగా ఇది భర్తీ చేయబడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అమ్మకాలపై ఎలాంటి ఒత్తిడిని కనిపించడం లేదని, దాంతో పాటు ముఖ్యంగా ప్రపంచ అనిశ్చితి దృష్ట్యా బంగారాన్ని సురక్షితమైన, నమ్మదగిన పెట్టుబడిగా చూస్తున్నారన్నారు. ఈ పండగ సీజన్‌లో బలమైన అమ్మకాలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నాణేలు, బార్ బుకింగ్ చాలాకాలం కిందట జరిగిందని ఇండియన్ బులియన్ అండ్ జ్యువెలరీ అసోసియేషన్ జాతీయ ప్రతినిధి కుమార్ జైన్ చెప్పారు. కానీ, గత సంవత్సరం కంటే చాలా తక్కువ. అయినప్పటికీ, అక్షయ తృతీయ నాడు అమ్మకాలు ఉండవచ్చని ఆశిస్తున్నారు. జవేరి బజార్‌లోని బీడీ బ్యాంగిల్స్ శ్రేయాన్స్ కొఠారి మాట్లాడుతూ.. ఈ సందర్భంగా వినియోగదారులు షాపింగ్ చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# శతకాలతో రెచ్చిపోతున్న చిచ్చరపిడుగులు.. నలుగురిలో కామన్‌పాయింట్ అదే!



'బ్రహ్మయ్యకు అర్థం కాని తలరాతలు కుర్రాళ్లు.. బ్రహ్మాండం బద్ధలు కొట్టే అణుబాంబులు కుర్రాళ్లు' అని అన్నాడో సినీకవి. అతడు చెప్పినట్టే ఈకాలం కుర్రాళ్లు ఏరంగంలోనే ఇరగదీస్తున్నారు. ముఖ్యంగా క్రికెట్ విషయానికొస్తే ఐపీఎల్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లతో వీరంగం సృష్టిస్తున్నారు. వరల్డ్ క్లాస్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ.. సిక్సర్లు, ఫోర్లతో మెరుపు శతకాలు బాదేస్తున్నారు. సోమవారం జైపూర్‌లో వైభవ్ సూర్యవంశీ సునామీలా విరుచుకపడి రికార్డు సెంచరీ కొట్టేశాడు. కేవలం 35 బంతుల్లోనే ఈ చిచ్చరపిడుగు వందతో గర్జించాడు. దాంతో, ఐపీఎల్ చరిత్రలోనే రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. 18వ ఎడిషన్‌లో మూడంకెల స్కోర్ సాధించిన నాలుగో క్రికెటర్‌గా నిలిచాడీ కుర్రాడు. ఈసారి ఐపీఎల్‌లో విశేషం ఏంటంటే.. నలుగురు శతక వీరులు భారత్‌కు చెందినవాళ్లే. వీళ్లలో కామన్ పాయింట్ ఏంటంటే.. వీళ్లందరి వయసు 27 ఏళ్ల లోపే. పైగా ఈ యంగ్‌స్టర్స్ 220 ప్లస్ స్ట్రయిక్ రేటుతో సెంచరీ కొట్టారు. వయసురీత్యా వీళ్లలో 14 ఏళ్ల వైభవ్ అందరికంటే చిన్నవాడు. అభిషేక్ శర్మ ప్రియాన్ష్ ఆర్యలకు 24 ఏళ్లు మాత్రమే. ఇషాన్ కిషన్‌కు 26 ఏళ్లు.

**విధ్వంసక బ్యాటింగ్‌తో**

ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు ఇషాన్ కిషన్ తొలి సెంచరీతో చెలరేగాడు. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో ఈ యువకెరటం రఫ్ఫాడించాడు. తన విధ్వంసక బ్యాటింగ్‌తో ఐపీఎల్‌లో కెరీయర్లో మొదటిసారి మూడంకెల స్కోర్ సాధించాడు. 225.53 స్ట్రయిక్ రేటుతో ఆడిన ఇషాన్ 42 బంతుల్లో 103 రన్స్ చేశాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. ఈ సీజన్‌లో రెండో సెంచరీ వీరుడు ప్రియాన్ష్ ఆర్య. ఈ పంజాబ్ కింగ్స్ ఓపెనర్ మెరుపు బ్యాటింగ్‌తో వంద బాదేశాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను ఉతికారేసిన ప్రియాన్ష్.. 245.23 స్ట్రయిక్ రేటుతో ఆడి 7 ఫోర్లు, 9 సిక్సర్లతో శతకం పూర్తి చేసుకున్నాడు.

**అభిషేక్ అలజడి**

ఐపీఎల్‌లో విధ్వంసక ఓపెనర్‌గా పేరొందిన అభిషేక్ శర్మ 18వ ఎడిషన్‌లో తన సెంచరీ కలను సాకారం చేసుకున్నాడు. ఉప్పల్ స్టేడియంలో అలజడి సృష్టించిన అతడు మెరుపు శతకం బాదాడు. పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 245 పరుగుల ఛేదనలో రెచ్చిపోయిన అభిషేక్.. 141 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ ధాటికి పంజాబ్ బౌలర్లు 14 ఫోర్లు, 10 సిక్సర్లు సమర్పించుకున్నారు. 256.36 స్ట్రయిక్ రేటుతో చెలరేగిన అభిషేక్ .. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోర్ నమోదు చేశాడు.

**సిక్సర్ల జడివాన**

జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లను చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీ సెంచరీతో విజృంభించాడు. 14 ఏళ్లకే ఐపీఎల్‌లో శతకం బాదిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. సిక్సర్లు, ఫోర్లతో రెచ్చిపోయిన వైభవ్.. 17 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత కూడా అదే జోరు చూపిస్తూ గుజరాత్ పేసర్లు ఇషాంత్, కరీమ్ జన్నత్ బౌలింగ్‌లో సిక్సర్ల వర్షం కురిపించాడు. మరో 18 బంతుల్లోనే అంటే.. 35 బంతుల్లోనే వందకు చేరువయ్యాడీ చిచ్చరపిడుగు. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఫైన్ లెగ్ దిశగా సిక్సర్ సాధించి సెంచరీ అభివాదం చేశాడు. తద్వారా ఈ మెగా లీగ్‌లో రెండో వేగవంతమైన సెంచరీ రికార్డు సొంతం చేసుకున్నాడీ లెఫ్ట్ హ్యాండర్. అయితే.. 30 బంతుల్లోనే శతకం బాదిన మాజీ ఆర్సీబీ ఓపెనర్ క్రిస్ గేల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## ఐపీఎల్ రికార్డు బ్రేకర్‌కు రివార్డు.. 10 లక్షలు ఇవ్వనున్న బిహార్ సీఎం



ఐపీఎల్‌లో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ పై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా భవిష్యత్ స్టార్ అంటూ మాజీ క్రికెటర్లు 14 ఏళ్ల వైభవ్‌కు కితాబులిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అభినందనలు తెలిపారు. తమ రాష్ట్రం ఖ్యాతిని యావత్ ప్రపంచం విస్తరించిన వైభవ్‌కు ప్రైజ్‌మనీ ప్రకటించారు. చిన్నవయసులోనే రికార్డులు బద్ధలు కొట్టిన అతడికి రూ.10 లక్షల రికార్డు ఇస్తామని సీఎం వెల్లడించారు. 'వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. ఐపీఎల్ చరిత్రలో రికార్డు సెంచరీ బాదిన అతడికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. తన శ్రమ, ప్రతిభతో ఐపీఎల్లో సంచనంగా మారాడు. భారత క్రికెట్ జట్టుకు భవిష్యత్ తారగా ఆవతరించాడు. ఐపీఎల్‌లో వైభవ్ ప్రదర్శన పట్ల మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం' అని నితీశ్ ప్రకటనలో తెలిపారు.

**12 ఏళ్లకే రంజీల్లో**

బిహార్‌కు చెందిన వైభవ్‌కు.. చిన్నప్పట్నుంచీ క్రికెట్ అంటే ఇష్టం. కోచ్ మనీశ్ ఓఝా సలహాలతో రాటుదేలిన ఈ కుర్రాడు 12 ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం చేశాడు. బిహార్ తరపున ఖతర్నాక్ ఇన్నింగ్స్‌లు ఆడి ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిలో పడ్డాడు. మెగా వేలంలో రాజస్థాన్ ఫ్రాంచైజీ అతడిని రూ.1.1 కోట్లకు కొన్నది.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్..




ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ నాట్ స్కైవర్-బ్రంట్ ఎంపికైంది. ఈ విషయాన్ని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మంగళవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. హీథర్ నైట్ స్థానాన్ని స్కైవర్ బ్రంట్ భర్తీ చేయనుంది. కాగా ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్సీ హీథర్ నైట్ రాజీనామా చేసింది. మహిళల యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ ఘోర పరాజయం పాలవ్వడంతో నైట్ ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ప్రధాన కోచ్ జాన్ లూయిస్‌పై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వేటు వేసింది. అతడి స్థానంలో మాజీ కెప్టెన్ చార్లెట్ ఎడ్వర్డ్స్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నియమించింది. ఇక ఇంగ్లండ్ కెప్టెన్‌గా ఎంపిక అయిన తర్వాత స్కైవర్-బ్రంట్ స్పందించింది. ఇంగ్లండ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. నేను ఎంతో అభిమానించే చార్లెట్ ఎడ్వర్డ్స్ సూచన మేరకు నా ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నాను. 2013లో అరంగేట్రం నుంచి ఇంగ్లండ్ క్రికెట్‌కు నా వంతు సహకారం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. జట్టును విజయపథంలో నడిపించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను అని బ్రంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. స్కైవర్-బ్రంట్‌కు కెప్టెన్‌గా అనుభవం ఉంది. హీథర్ నైట్ గైర్హాజరీలో 11 టీ20ల్లో ఇంగ్లండ్ జట్టుకు సారథ్యం వహించింది.



# అప్పుడు థ్రిల్లర్.. ఇప్పుడు హారర్

తెలుగులో చాలామంది హీరోలు ఉన్నారు. వాళ్లలో ఒకడు బెల్లంకొండ శ్రీనివాస్. పదేళ్లకు పైనే ఇండస్ట్రీలో ఉన్నాడు కానీ చెప్పుకోదగ్గ సినిమాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. చివరగా 2023లో ఛత్రపతి చిత్రాని హిందీలో రీమేక్ చేసి ఘోరంగా ఫెయిలయ్యాడు. దీంతో చాలా గ్యాప్ తీసుకుని ఒకేసారి నాలుగు సినిమాల్ని రెడీ చేస్తున్నాడు. అందులో 'భైరవం' త్వరలో రిలీజ్ అవుతుంది. ఇప్పుడు 'కిష్కిందపురి' అని మరో మూవీ ప్రకటించాడు. తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. పాడుబడ్డ పెద్ద భవంతి, అందులో హీరో అండ్ గ్యాంగ్ వెళ్తారు. తర్వాత ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనే అంశాలతో ఈ 'కిష్కిందపురి' తీసినట్లు అనిపిస్తుంది. గతంలో బెల్లంకొండ హీరోతో 'రాక్షసుడు' సినిమాలో నటించిన అనుపమ.. ఇందులో హీరోయిన్. తొలిసారి హారర్ జానర్ సినిమాతో బెల్లంకొండ శ్రీనివాస్ రాబోతున్నాడు. ఈ వర్షాకాలంలోనే మూవీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకుడు. మరి ఈసారైనా బెల్లంకొండ హిట్ కొడతాడా? ఈ గ్లింప్స్ చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. చివర్లో హీరో... అహం మృత్యు అని చెప్పిన డైలాగ్, ఆ టైంలో కళ్లు దెయ్యం కళ్లలా ఉండటం చూస్తుంటే ఈసారి ప్రేక్షకుల్ని భయపెడతారనిపిస్తోంది. గతంలో అనుపమతో థ్రిల్లర్ మూవీ చేయగా.. ఇప్పుడు హారర్ చేశాడు శ్రీనివాస్.

# అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా నుంచి కీలకమైన అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ఎన్టీఆర్ ప్రకటించారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో పీరియాడికల్ స్టోరీతో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది . ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏప్రిల్ 22 నుంచి షూటింగ్‌లో ఎన్టీఆర్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'దేవర' తర్వాత ఎన్టీఆర్.. 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ ఇలా ఇద్దరూ తెలుగులో కలిసి చేస్తున్న చిత్రమిదే కావడంతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అభిమానులకు ఎన్టీఆర్ శుభవార్త చెప్పారు. చిత్రాన్ని 2026 జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా మే 20న ఈ మూవీ నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇద్దరు డైనమిక్ వ్యక్తుల కాంబినేషన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విధ్వంసమే జరగనుంది. ఆ అనుభూతి పొందేందుకు సిద్ధకండి అంటూ మైత్రీ మూవీ మేకర్స్ పేర్కొంది. వచ్చే సమ్మర్‌లో బాక్సాఫీస్ వద్ద ఫుల్ సందడి వాతావరణం కనిపించడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. ప్రస్తుతం కర్ణాటకలో ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. మొదట వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే, కథ వల్ల వీఎఫ్ఎక్స్ పనులతో పాటు చిత్రీకరణ విషయంలోనూ మరింత స్ట్రాంగ్‌గా ప్లాన్ చేయడం వల్లే కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు కూడా మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ విషయానికి వస్తే.. తారక్ నటిస్తోన్న 31వ చిత్రమిది. షూటింగ్‌లో భాగంగా కొద్దిరోజుల క్రితమే రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్డ్ కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసి అక్కడ కొన్ని సీన్స్ చిత్రీకరించారు. ఇప్పటికే చాలా వరకు షూటింగ్ పనులు కూడా పూర్తి అయ్యాయి. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కించబోయే సీన్లు మాత్రం కాస్త ఆలస్యంగా ప్రారంభించారు. శ్రీలంకలోని కొలంబోలో కూడా ఎన్టీఆర్‌తో షూటింగ్ షెడ్యూల్స్ ఉన్నాయి. ఆల్రెడీ యూనిట్‌లోని కీలక సాంకేతిక నిపుణులు కొలంబో వెళ్లి, అక్కడి లొకేషన్స్‌ను ఫైనల్ చేశారని తెలిసింది.



# ఏడాది తర్వాత.. మరో ఓటీటీలోకి కామెడీ ఎంటర్‌టైనర్..

శ్రీవిష్ణు కథానాయకుడిగా శ్రీహర్ష కొనుగంటి తెరకెక్కించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓం భీమ్ బుష్' గతేడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆడియన్స్‌కు నవ్వులు పంచి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉన్న ఈ సినిమా ఇప్పుడు మరో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చేస్తోంది. సింప్లీ సౌత్ వేదికగా మే 2 నుంచి ప్రసారం కానుంది. శ్రీవిష్ణుతో పాటు ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన ఇందులో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, ఆదిత్య మీనన్ తదితరులు నటించారు.

కథేంటంటే: లెగసీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులు బ్యాంగ్ బ్రదర్స్ క్రిష్ (శ్రీవిష్ణు), వినయ్ గుమ్మడి (ప్రియదర్శి), మ్యాడీ రేలంగి (రాహుల్ రామకృష్ణ). వీళ్లు చేసే పనులు భరించలేక తక్కువ సమయంలోనే ముగ్గురికీ డాక్టరేట్లు ఇచ్చి పంపించేస్తారు కళాశాలలోని ప్రొఫెసర్. దాంతో వీరు భైరవపురం చేరుకుంటారు. ఏ టు జెడ్ సర్వీసెస్ పేరుతో ఓ దుకాణం తెరిచి ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం చూపిస్తామని ప్రచారం చేసుకుంటారు. కానీ ఈ ముగ్గురూ ఊరి జనాల్ని బురిడీ కొట్టిస్తున్నారనే విషయం బయటపడుతుంది. దాంతో ఊరి సర్పంచ్ ఓ పరీక్ష పెడతారు. సంపంగి మహల్‌లో ఉన్న నిధిని కనిపెట్టి తీసుకొస్తే వారిని నమ్ముతామని చెబుతారు. దెయ్యం ఉన్న ఆ మహల్‌లోకి నిధి కోసం వెళ్లాక ఈ బ్యాంగ్ బ్రదర్స్‌కి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఇంతకీ ఆ మహల్‌లో ఉన్న సంపంగి దెయ్యం కథేమిటి?అనేది సినిమాలో చూపించారు.

# నితిన్‌కి 'ఎల్లమ్మ' కష్టాలు!



'బలగం' తర్వాత దర్శకుడు వేణు చాలా గ్యాప్ తీసుకున్నాడు. తన రెండో సినిమా 'ఎల్లమ్మ' అని ప్రకటించి చాలా రోజులైంది కానీ, ఇంకా పట్టాలెక్కలేదు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో తొలుత నాని హీరోగా నటిస్తారనే ప్రచారం జరిగింది. నాని కూడా వేణుతో సినిమా చేస్తానని చెప్పారు. ఏం జరిగిందో తెలియదు కానీ నాని ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. చివరకు ఈ కథ అటు తిరిగి ఇటు తిరిగి నితిన్ దగ్గర వెళ్లింది. కథ బాగా నచ్చడంతో నితిన్ ఈ చిత్రాన్ని వెంటనే ఓకే చేశాడు. డేట్స్ కూడా అరేంజ్ చేసుకున్నాడు. నిర్మాత దిల్ రాజు కూడా సినిమా షూటింగ్ స్టార్ట్స్ చేసేందుకు రెడీగా ఉన్నాడు. కానీ ఈ సినిమాకు కీలకమైన హీరోయిన్ మాత్రం దొరకడం లేదట. 'ఎల్లమ్మ' కోసం అటు దిల్ రాజు, నితిన్.. ఇటు వేణు తెగ వెతుకుతున్నారట. బలగం మాదిరే ఈ కథ కూడా రూరల్ నేపథ్యంలోనే సాగుతుదంట. దర్శకుడు వేణు చాలా పకడ్బంధీగా ఈ సినిమా స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడట. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకి చాలా ప్రాధాన్యత ఉంటుందట. కథ మొత్తం ఆమె చుట్టునే తిరుగుతుంది. అందుకే ఓ స్టార్ హీరోయిన్‌ని ఆ పాత్రకు తీసుకోవాలనుకున్నారట. తొలుత సాయి పల్లవి అయితే బాగుంటందని ఆమెను సంప్రదించారు. అయితే సాయి పల్లవి ఈ సినిమా చేయలేనని చెప్పేసిందట. దీంతో మరో స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ అయితే 'ఎల్లమ్మ'కు న్యాయం చేస్తుందని ఆమెను సంప్రదించారట. అయితే కథ, పాత్ర బాగా నచ్చినప్పటికీ.. డేట్స్ ఖాలీగా లేకపోవడం నో చెప్పేసిందట. శ్రీలీలను తీసుకుందామంటే.. అల్రెడీ నితిన్‌తో రెండు సినిమాలు చేసింది. అవి కూడా ఫ్లాప్ అవ్వడంతో దిల్ రాజు వెనకడుకు వేస్తున్నాడట. ఇక రష్మిక, సమంత లాంటి హీరోయిన్లు కూడా ఖాలీగా లేరు. నితిన్ ఎప్పుడైన తన సినిమాలకు ట్రెండింగ్ హీరోయిన్‌ని తీసుకుంటాడు. కానీ ఈ సారి మాత్రం అది వర్కౌట్ అయ్యేలా లేదు. స్టార్ హీరోహీరోయిన్లు అంతా బిజీగా ఉన్నారు. మరి 'ఎల్లమ్మ'గా ఎవరు ఎంట్రీ ఇస్తారో చూడాలి.

# రాజమౌళి సినిమా కోసం మరీ ఇంత చేంజా!



సూపర్ స్టార్ మహేష్ బాబు టాలీవుడ్ స్టార్ హీరోలలో ఒకరు. ఆయన గ్లామర్‌కి ఎవరైన ఫిదా కావల్సిందే. కృష్ణ నటవారసుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మహేష్ తనదైన నటనతో స్టార్ హీరోగా ఎదిగాడు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు తన 29వ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ సినిమా చరిత్రలోనే రాజమౌళి ఈ చిత్రాన్ని అత్యంత భారీ చిత్రంగా రూపొందిస్తున్నారు. ఏకంగా 1000 కోట్ల బడ్జెట్ లో ఈ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ మూవీతని ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాజమౌళి అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే రాజమౌళి సినిమాలో హీరో లుక్ గత సినిమాల కన్నా భిన్నంగా ఉంటుందనే విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందనే చర్చ గత కొన్ని రోజులుగా నడుస్తుంది. ఈ క్రమంలో మహేష్ బాబు లేటెస్ట్ లుక్ లీక్ అయింది. ఇందులో హెయిర్, గడ్డం పొడవుగా కనిపిస్తున్నాయి. లేటెస్ట్ లుక్ మాత్రం ఫ్యాన్స్ కి షాకింగ్ గా ఉంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,